


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


**లిస్ట్-ఎ క్రికెట్‌లో నయా వరల్డ్ రికార్డ్.. 11 బంతుల్లోనే వైభవ్ సూర్యవంశీ అర్ధసెంచరీ!**




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 166 | సోమవారం 22 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు...

ప్రభుత్వ విజయాలను, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించడమే లక్ష్యం

గతంలో విడుదల చేసిన 7 శ్వేతపత్రాల తరహాలోనే ఈ నివేదికల రూపకల్పన

రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ఎలా నడిపించామో స్పష్టం చేయాలని సూచన

అసత్య ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం



## మరింత తీవ్రంగా దాడి చేస్తాం...

## ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్

లెబనాన్‌లోని అనుకూల గ్రూపులను అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

లేదంటే గత వారం కంటే తీవ్రమైన దాడులు తప్పవని స్పష్టం

ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం

చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమం, కాల్పుల విరమణపై దృష్టి

ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలతో ఒప్పందం అమలులో సవాళ్లు



## ముగిసిన నీట్ రీ ఎగ్జామ్...



ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష

ఫిజిక్స్ కఠినంగా, బయాలజీ సులభంగా ఉందన్న విద్యార్థులు

దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు

జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా

జూలై చివరి వారంలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

## టీఎంసీకి భారీ షాక్..

### 440 కోట్ల నిధులున్న బ్యాంకు ఖాతాలు స్తంభన

టీఎంసీకి చెందిన రూ.440 కోట్ల నిధులున్న మూడు బ్యాంకు ఖాతాలు స్తంభన

తిరుగుబాటు ఎమ్మెల్యేల ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న పోలీసులు

నిధుల మూలాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్న రెబల్ వర్గం

పార్టీలో చీలిక నేపథ్యంలో నిధుల కోసం రెండు వర్గాల మధ్య పోరు



## నీట్ విద్యార్థులు ఆ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయింది:



రీ-నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం

వేలాది మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని మంత్రి వెల్లడి

ఇది విద్యార్థుల సంక్షేమానికి నిదర్శనమన్న మంత్రి పొన్నం ప్రభాకర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకున్న నిర్ణయమని ప్రశంస

## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..

## డ్రైవర్ అప్రమత్తతతో 41 మంది సేఫ్



కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు

షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా

డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు

నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా కాలిపోయిన బస్సు

## '20 ఏళ్ల వయసులో కంటే 40 ఏళ్లకే ఎక్కువ ఫ్లెక్సిబిలిటీ సాధించాలి'..

కోల్‌కతాలోని చారిత్రక రెడ్ రోడ్ వేదికగా జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించిన మోదీ

ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక థీమ్‌తో వేడుకలు

210 భారతీయ రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో 2,500 యోగా ప్రదర్శనలు



## తమిళనాడులో ఘోర ప్రమాదం...

### అమ్మోనియా వాయువు లీకై ఏడుగురు మృతి



తమిళనాడు సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్

ఈ దుర్ఘటనలో ఏడుగురు కార్మికుల మృతి

74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం

యూనిట్‌లో వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం

ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం

## యోగా నాకు చాలా ఇచ్చింది

యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్

తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి

యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న



## కాంగ్రెస్‌లో మళ్లీ రాజుకున్న 'థరూర్ వర్సెస్ ఖేరా' లొల్లి..



## ‘20 ఏళ్ల వయసులో కంటే 40 ఏళ్లకే ఎక్కువ ఫ్లెక్సిబిలిటీ సాధించాలి’..

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం (జూన్ 21, 2026) అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఏడాది భారతదేశపు ప్రధాన జాతీయ వేడుకకు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రక ‘రెడ్ రోడ్‘ వేదికైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సభకు స్వయంగా హాజరై, వేలాది మంది ఉత్సాహవంతులైన ప్రతినిధులు, సాధారణ ప్రజలతో కలిసి సామూహిక యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ‘ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా’ అనే ప్రత్యేక నినాదంతో (థీమ్) నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా శారీరక చలనశీలత, మానసిక ప్రశాంతత, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రధాని నొక్కిచెప్పారు. రెడ్ రోడ్‌పై ఏర్పాటు చేసిన భారీ బహిరంగ వేదిక నుంచి మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. యోగా అనేది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని అనుసంధానించే ఒక గొప్ప సామూహిక శక్తిగా ఎదిగిందని కొనియాడారు. “మనం 20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి కంటే 40 ఏళ్ల వయసు వచ్చేసరికి మరింత శారీరక ఫ్లెక్సిబిలిటీని సాధించడమే మన లక్ష్యం కావాలి“ అని పిలుపునిచ్చారు. కోల్‌కతా నగరం ఈ ప్రధాన జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడంతో, నగరవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ వేడుకల సన్నాహకంగా నగరంలో ముందస్తుగా ‘దౌడ్ సే ధ్యాన్‘ (పరుగు నుండి ధ్యానం వైపు) మారథాన్, డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా గంగానదిపై 500 పడవల్లో ఒకేసారి యోగాసనాలు వేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేందుకు చేసిన ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సహా పలువురు ఉన్నతాధికారులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని యోగా విశిష్టతను చాటారు. భారతదేశం ప్రతిపాదించిన ఈ యోగా సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా డిజిటల్, భౌతిక రూపాల్లో విస్తరించింది. విదేశాల్లోని దాదాపు 210 భారతీయ దౌత్య కార్యాలయాల సమన్వయంతో అంతర్జాతీయంగా 2,500కి పైగా ప్రధాన నగరాలు, సాంస్కృతిక కేంద్రాలలో యోగా ఉత్సవాలు జరిగాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం కూడా ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది. దేశంలోని కర్ణాటక, ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాల్లోనూ స్వచ్ఛత, ఫిట్‌నెస్ కార్యక్రమాలతో ముడిపెట్టి సామూహిక యోగా సెషన్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఖరీదైన పరికరాలు అవసరం లేకుండా, కేవలం శ్వాసపై నియంత్రణ, శారీరక సమతుల్యత ద్వారా ఒత్తిడిని తగ్గించి, నిద్రలేమి సమస్యలను దూరం చేసే యోగా విధానం.. ప్రస్తుత ఆధునిక వేగవంతమైన ప్రపంచంలో మానవాళికి ఒక సంజీవనిలా మారుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## నీట్ విద్యార్థులు ఆ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయింది:

నేడు జరిగిన రీ–నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## తమిళనాడులో ఘోర ప్రమాదం... అమ్మోనియా వాయువు లీకై ఏడుగురి మృతి

తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24–25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## యోగా నాకు చాలా ఇచ్చింది

అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. “భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి“ అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. “నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి“ అని ఆయన వివరించారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. **విశాఖలో ఘనంగా యోగా వేడుకలు** మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్–ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో మళ్లీ రాజుకున్న ‘థరూర్ వర్సెస్ ఖేరా’ లొల్లి..

**నావికుల రక్షణపై మోదీ మాట్లాడారని ప్రశంసించిన శశి థరూర్**

**విదేశాంగ శాఖ అధికారిక నివేదికలో ఎక్కడా నావికుల ప్రస్తావన లేదన్న పవన్ ఖేరా**

**భారతీయ నావికులు మరణించిన అంశాన్ని మోదీ లేవనెత్తారన్న థరూర్**

**ఈ అంశానికి రాజకీయ రంగు పూయడం తగదంటూ సాక్ష్యాలతో థరూర్ సమాధానం**

**రాహుల్ గాంధీ వైఖరిని శశి థరూరే తప్పుబట్టారన్న బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా**

కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశి థరూర్ మరోమారు తన సొంత పార్టీలోనే తీవ్ర వివాదానికి కేంద్రబిందువుగా మారారు. జీ–7 సదస్సు వేదికగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ భారతీయ వాణిజ్య నౌకల నావికుల భద్రత గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను శశి థరూర్ ప్రశంసించడం ఇందుకు కారణమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన బహిరంగ, వ్యక్తిగత సమావేశాల్లో పౌర నావికులను సైనిక దాడుల లక్ష్యాలుగా చేసుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని మోదీ బలంగా వినిపించారని థరూర్ కొనియాడారు. అయితే ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా స్పందిస్తూ.. శశి థరూర్‌పై సోషల్ మీడియాలో సెటైర్లు వేశారు. పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, విదేశాంగ శాఖ విడుదల చేసిన భారత్–అమెరికా అధికారిక ఉమ్మడి ప్రకటనలో ఒమన్ గల్ఫ్‌లో అమెరికా దళాల దాడి వల్ల ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఉదంతం గురించి ఎక్కడా ప్రస్తావన లేదని స్పష్టం చేశారు. “ప్రధాని మోదీపై శశి థరూర్‌కున్న ఆరాధన భౌతిక ప్రపంచ సరిహద్దులను దాటిపోయింది. అందుకే మోదీ అనని మాటలను కూడా ఆయన వినగలుగుతున్నారు“ అంటూ పవన్ ఖేరా ఎద్దేవా చేశారు. దీనికి తోడుగా, విపక్ష నేత రాహుల్ గాంధీ అభిప్రాయాలకు భిన్నంగా థరూర్ ప్రభుత్వం వైపు మాట్లాడటంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ పరిణామాన్ని సొమ్ము చేసుకునేందుకు రంగంలోకి దిగిన బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా.. కాంగ్రెస్ అంతర్గత విభేదాలను ఎండగడుతూ రాహుల్ గాంధీ పుట్టినరోజు నాడే శశి థరూర్ ఆయనకు గట్టి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. సొంత పార్టీ నుంచే విమర్శలు వెల్లువెత్తడంతో శశి థరూర్ ఎక్స్ వేదికగా దీటుగా బదులిచ్చారు. దేశ పౌరుల ప్రాణాల రక్షణ, నావికుల భద్రత వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం వివాదంగా మార్చడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన ఈ అంశంలో రాజకీయం చేయడం కంటే పౌరుల క్షేమం కోసం అందరూ ఏకమవ్వాలని హితవు పలికారు. అంతేకాకుండా, తాను ప్రింట్ మీడియాలో వచ్చిన కథనాలు, గూగుల్ జెమిని సారాంశాల ఆధారంగానే నిజాలు మాట్లాడానని, తన జీవితంలో ఎప్పుడూ వాస్తవాలను వక్రీకరించలేదని థరూర్ గట్టిగా సమర్థించుకున్నారు.

## రాజ్యాంగ నైతికతకు కవిత్వ రూపం!

“ప్రణవనాదాలెన్ని ప్రతిధ్వనించినా/ ఆదిమస్వరం నాదే/ ధరిత్రికి ఊపిరి నేను/ చరిత్రకు తొలి అక్షరం నేను/ నాగరికతకు నారుపోసి/ నీరు పోసింది నేను/ సంస్కృతికి బొడ్డుకోసి పేరుపెట్టింది నేనే/ సంగీత సాహిత్యాలు/ నాచెమట బొట్టు కన్నబిడ్డలు/... ఉన్మాదంపై/ నాది నిత్యదండయాత్ర/ నేనే నిజమైన దేశభక్తుడిని” సంపద సృష్టికర్తలైన దళిత బహుజనులే ఈ దేశ సాంస్కృతిక నిర్మాతలనే, నాగరికతకు మూలమనే ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కోయి కోటేశ్వరరావు ‘నాగస్వరం’ కవితా సంపుటిని తీసుకొచ్చాడు. ఇది దళితతాత్త్వికతను, దళిత ఈస్తటిక్స్‌ని వాగ్దానం చేసే అత్యంత శక్తివంతమైన కవిత్వం. సంప్రదాయ సాహిత్యంలోని ‘సత్యం, శివం, సుందరం’ అనే భావనలకు భిన్నంగా సమానత్వం, స్వేచ్ఛ, సామాజికన్యాయం అనే రాజ్యాంగ నైతిక సూత్రాలను కళాత్మకంగా కవిత్వీకరించడం కోటేశ్వరరావు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. గత మూడు దశాబ్దాలుగా తాను ప్రత్యక్షంగా గమనిస్తున్న మనువాద సమాజ తీరుతెన్నులను; రాజకీయ, ఆర్థిక స్థితిగతులను; దళిత, బహుజన జీవితాల వేదనలను కోటేశ్వరరావు విమర్శనాత్మకంగా కవిత్వంలో పలికించాడు. దళిత కుటుంబంలో జన్మించిన కోయి, బాల్యంలో ఆకలి అవమానాలను అనుభవించి, ఆ అనుభవంతో తెలుగు సాహిత్యంలో తనదైన ప్రత్యేక గొంతుతో కవిత్వం రాశాడు. సంప్రదాయ సాహిత్యంతో పాటు ఆధునిక సాహిత్యతత్త్వాన్ని అవగాహన చేసుకున్న సహృదయ కవిపండితుడు, విమర్శకుడు కోయి. దళిత జీవితంలోని పేదరికం, కులవివక్ష, రోజువారీ అణచివేతల వంటి దళిత వాస్తవికత, సంఘర్షణలను, వారి శ్రమతత్త్వాన్ని కవి సజీవంగా కవిత్వీకరించాడు: “వేదంలో ఏముందో తెలియదు గానీ/ మా అయ్య స్వేదంలోనే సృష్టి జీవం ఉంది” (‘ప్రాణవాయువు’); “పత్తిచేలో ఇంకిపోయిన నెత్తురంతా/ మట్టిపెడాలమీద తెల్లగా నవ్వితేనే కదా నువ్వు బతికి బట్టకట్టింది” (‘లద్దెపురుగు’) తల్లిదండ్రుల శ్రమను కేవలం కష్టానికి ప్రతీకగా మాత్రమే కాకుండా, సృష్టికి మూలంగా చిత్రించడంలో ఎంతో ఔచిత్యాన్ని ప్రదర్శించాడు: “మట్టిమబ్బుల్లో చెమటచుక్కల్ని నాటి/ ఎండి ఎన్నెల్ని బస్తాలకెత్తే” శ్రామికుడైన తండ్రిని “నల్ల చంద్రుడిగా” అభివర్ణించడం దళితకళాతత్త్వానికి నిదర్శనం. శ్రమను వెన్నెలతో పోల్చి దళిత శ్రమను విశ్వవ్యాప్త సృజనాత్మక శక్తిగా ఆవిష్కరించాడు. ‘కొత్త చెప్పులు’ కవితలో, “వొడ్లగింజల్లో ఇంకిపోయిన/ మా అయ్య వొంటిసత్తువ/ కూటికుండలో/ తుకతుక ఉడక్కపోతే/ ఊరికి కూడెట్టా దొరికేది?” అనే ప్రశ్నలు శతాబ్దాలుగా అణచివేయబడిన శ్రమదోపిడీని నిలదీస్తాయి. తాపీమేస్త్రిగా పనిచేస్తున్న తన తమ్ముడు శివ శ్రమ ఔన్నత్యాన్ని ‘నమశ్శివాయ’ కవితలో బొమ్మకట్టించాడు: “మిట్ట మధ్యాహ్నం వాడు మోస్తున్న/ ఇటుకల కాంతిలో ఎరుపెక్కిన చెమట చుక్కలు/ తనువు నుండి రాలి పడుతుంటే/ నేల తల్లిపై పగడాలవాన కురిసినట్లుండేది/ ఒంటి నిండా సిమెంటు ధూళితో/ తమ్ముడు సాయంత్రం ఇంటికి వస్తున్నప్పుడు/ భస్మాంగరాగయ నమశ్శివాయ అంటూ/ అంటూ పంచభూతాలు జేజేలు పలుకుతాయి”. దళిత స్త్రీ జీవితం, కులవ్యవస్థతో పాటు పితృస్వామ్య వ్యవస్థలో కూడా బానిసత్వానికి గురవుతుంది. దీన్ని “బానిసకు బానిస” అనే బలమైన భావనతో ఆవిష్కరించాడు. ‘పత్తి పువ్వు’ కవితలోని “ఊరందరికీ మా అయ్య బానిసైతే/ పాపం అమ్మ, మా అయ్యక్కూడ బానిస” అనే పంక్తులు దళిత స్త్రీ ఎదుర్కొనే అంతర్గత అణచివేతను సూచిస్తాయి. “మాసిపోయిన వరదగుడి లాంటి/ అమ్మను చూసినప్పుడల్లా గొంతు చిట్లిపోయి/ పెన్ను నెత్తురు కక్కుతుంది/ అక్షరాలు మోయలేని/ ఒక ఏడుపు కొండ/ కనుల కొమ్మలకు వేలాడుతుంది/ ఆడతనం అంటరానితనాల నడుమ/ అమ్మ రోకలి బండ కింద చితికిన దోసబద్దయి రోదిస్తుంది” (‘పత్తిపూవు’) వంటి పదచిత్రాలు దళితస్త్రీలు ఎదుర్కొనే బహుముఖీన వివక్షను నిత్యపోరాటంలోని సంఘర్షణని ప్రతిబింబిస్తాయి. కవిత్వంలో కేవలం బాధను వ్యక్తం చేసి ఊరుకోకూడదు. దాన్ని ఆయుధంగా మలచి తిరుగుబాటు చేసేలా ప్రేరేపించాలి. ‘గుండెడప్పు’ కవితలో రిజర్వేషన్లపై వచ్చిన విమర్శలకు ధీటుగా “ధాత్రి వేణువు ఊది/ ధాన్యరాగాలు పలికించే హరిత ప్రతిభ నాది”, “అగ్ని ప్రతిభ నాది” అంటూ దళిత మేధస్సును, శారీరకశక్తిని గర్వంగా, నిలువెత్తు ఆత్మవిశ్వాసంతో ప్రకటించడం దళిత్ ఈస్తటిక్స్‌లో భాగమే. దీన్నే దళిత తిరుగుబాటు, అస్తిత్వ ప్రకటన (ఋశ్రీఈ‾ూవర్ష్ట్రవ్ఱఎం శీట =వంఱర్ఘుఅఎవ ఖఅఎ‾ూంంవఔఱశీఅ) అంటారు. ‘ఉలిపికట్టె’ కవితలో, మధ్యాహ్న భోజనంలో కుల వివక్షను ప్రశ్నిస్తూ “నాచేయి తగలగానే పరబ్రహ్మ స్వరూపం కూడా/ పనికి రానిదైపోయింది...?” అని అడగడం ద్వారా, కవి ఆ మత, సాంస్కృతిక ఆధిపత్యం యొక్క పవిత్రత (ొబఎఱ్ఙఎ) అనే భావనను ప్రశ్నించి, తద్వారా ప్రత్యామ్నాయ సంస్కృతిని అన్వేషించాలనే ఆలోచనను కలిగిస్తాడు. “మన సాంకేతిక పరిజ్ఞానం చంద్రుడి మీద రహస్యాలు శోధిస్తుంటే/ మన సంస్కారం మాత్రం ఇంకా కులం మలాన్ని వాసన చూస్తుంది” వంటి విమర్శలతో, ఆధునిక సాంకేతిక యుగంలో కూడా కుల అస్తిత్వాన్ని వదలని అమానుషాన్ని ప్రశ్నిస్తాడు. కులోన్మాదం, మతసామ్రాజ్యవాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ వ్యతిరేకతపై ‘నాగస్వరం’ ద్వారా కవిత యుద్ధం చేశాడు కవి. “వాడంతే పరమ యుద్ధోన్మాది/ ఒక్క చమురు బొట్టు కోసం/ లెక్కలేని రక్తసముద్రాలను పొంగిస్తాడు” అంటూ అమెరికా దురహంకారాన్ని ఎదిరించాడు. “నాగజాతి రక్తసంతకాన్నినేను/ ధమ్మపథ బాటసారిని నేను/ సత్యజ్యోతి కిరణాన్ని/ నేను భీమపతాకాన్ని” అంటూ కవి తన కవితాదృక్పథాన్ని స్పష్టంగా తెలియజేశాడు. బుద్ధుడు, పూలే, ముఖ్యంగా అంబేద్కర్ సైద్ధాంతిక ఎరుకతో తన కవిత్వానికి అపారమైన శక్తిని సమకూర్చుకొని పాఠకుల్ని ఆలోచింపజేస్తాడు కవి. దళితులు, బహుజనులంతా రాజ్యాధికారం కోసం కలిసి ప్రయాణం చేయాలన్న సందేశాన్ని కవిత్వం ద్వారా అందిస్తున్నాడు. ‘కాలసర్పం’, ‘భీమరాజ్యం’ వంటి కవితలు ఇందుకు ఉదాహరణలు.

## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు ‘ప్రోగ్రెస్ రిపోర్ట్స్‘ విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను, మంత్రులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఎలా అభివృద్ధి పథంలోకి నడిపించారో ఈ నివేదికల ద్వారా ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ఏడు అంశాల్లో శ్వేతపత్రాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, విద్యుత్, శాంతిభద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ వంటి అంశాలపై వాస్తవ పరిస్థితులను ఆ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచారు. ఇప్పుడు ఆ శ్వేతపత్రాలకు కొనసాగింపుగా ఈ ‘ప్రోగ్రెస్ రిపోర్ట్స్‘ ఉండాలని సీఎం సూచించారు. వివిధ శాఖల్లో వచ్చిన మార్పులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను సమగ్రంగా ఇందులో పొందుపరచాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అసత్య ప్రచారాలను (ఫేక్ న్యూస్) తిప్పికొట్టేందుకు, వాస్తవాలను ప్రజల ముందు ఉంచి రాష్ట్రాన్ని ఎలా గాడిన పెట్టారో స్పష్టంగా తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నివేదికల ద్వారా రెండేళ్ల ప్రభుత్వ పనితీరును ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## మరింత తీవ్రంగా దాడి చేస్తాం... ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్

ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కీలక చర్చలు జరుగుతుండగానే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపుల కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని, లేదంటే గత వారం కంటే మరింత తీవ్రమైన సైనిక చర్య తప్పదని ఆదివారం స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. “లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న తమ ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ వెంటనే ఆపాలి. అలా చేయని పక్షంలో, మేం గత వారం కంటే ఈసారి చాలా గట్టిగా ఇరాన్‌పై దాడి చేస్తాం“ అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హార్ముజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి. లెబనాన్‌లో కాల్పుల విరమణను కాపాడే ప్రయత్నాలపై ఉపాధ్యక్షుడు వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఒప్పందాల అమలులో కొన్ని ఇబ్బందులు సహజమేనని, పరిస్థితి సున్నితంగా ఉందని అంగీకరించారు. అధ్యక్షుడు ట్రంప్ తమకు పూర్తి అధికారాలు ఇచ్చారని వెల్లడించారు. ఇరాన్ అణ్వాయుధాలపై ఆశలు వదులుకుంటేనే అమెరికాతో సత్సంబంధాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. శాశ్వత కాల్పుల విరమణకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని వాన్స్ ఉద్ఘాటించారు.

## ముగిసిన నీట్ రీ ఎగ్జామ్...

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రియాద్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో కూడా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ఎప్పట్లాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతం కావడం కనిపించింది. పరీక్ష రాసిన విద్యార్థుల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, ఈసారి ప్రశ్నపత్రం మొత్తం మీద మధ్యస్థంగా ఉంది. అన్ని విభాగాల్లోకెల్లా ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని, ఆ తర్వాత కెమిస్ట్రీ ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, బయాలజీ విభాగం మాత్రం చాలా సులభంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ముగియడంతో, వివిధ కోచింగ్ సంస్థలు త్వరలోనే అనధికారిక ఆన్సర్ కీలను విడుదల చేయనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారిక ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 28 నాటికి విడుదల చేసే అవకాశం ఉంది. దీనిపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది కీని, ఫలితాలను ప్రకటిస్తారు. నీట్ యూజీ 2026 ఫలితాలను జూలై చివరి నాటికి వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమ స్కోర్‌కార్డులను అధికారిక వెబ్‌సైట్ అవవ్.ఙ్ఖ.అఱఎ.ఱఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2026లో జరిగిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి ఈ పునఃపరీక్షను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను గమనించాలని అధికారులు సూచించారు.

## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

## టీఎంసీకి భారీ షాక్.. 440 కోట్ల నిధులున్న బ్యాంకు ఖాతాలు స్తంభన

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం రేకెత్తిస్తూ.. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను అధికారులు స్తంభింపజేశారు. సుమారు రూ.440 కోట్ల నిధులున్న ఈ ఖాతాలపై వేటు పడటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీలో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తిరుగుబాటు నేత రిత్నబ్రత బెనర్జీ వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బిధానగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. పార్టీ ఖాతాల్లో జమ అయిన నిధుల మూలాలపై సమగ్ర విచారణ జరపాలని, అందులో “కట్ మనీ“, బలవంతపు వసూళ్లు, ప్రజాధనం దుర్వినియోగం వంటి అక్రమాలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు.. కోల్‌కతాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెంట్రల్ ప్లాజా బ్రాంచ్‌లో ఉన్న పార్టీ ఖాతాల నుంచి నగదు ఉపసంహరణ (డెబిట్ ఆపరేషన్స్) నిలిపివేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఇటీవలి ఎన్నికల అనంతరం టీఎంసీలో విభేదాలు పొడచూపిన విషయం విదితమే. ఈ క్రమంలోనే పార్టీ మాజీ కోశాధికారి అరూప్ బిస్వాస్ జూన్ 12న బ్యాంకు యాజమాన్యానికి లేఖ రాస్తూ.. పార్టీలో అంతర్గత వివాదాలు ఉన్నందున లావాదేవీలను నిలిపివేయాలని అభ్యర్థించారు. అయితే, తిరుగుబాటు ఎమ్మెల్యేల ఫిర్యాదుతో ఈ వ్యవహారంలోకి పోలీసులు ప్రవేశించి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ పరిణామాలను టీఎంసీ అధికారిక వర్గాలు తీవ్రంగా ఖండిస్తూ, ఇదంతా రాజకీయ ప్రేరేపితమని ఆరోపిస్తున్నాయి. తమ పార్టీ ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగానే ఉన్నాయని, ఈ వ్యవహారాన్ని చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాయి. మరోవైపు, అరూప్ బిస్వాస్‌కు పార్టీ ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# హోసన్న మందిర్ సమీపంలో ఇల్లే టార్గెట్

# 'ఇంటి కన్నం' దొంగ అరెస్ట్!





**పెళ్లికి వెళ్లిన కుటుంబం.. తాళాలు పగలగొట్టి బీభత్సం**

**తెలంగాణ ముఠాగా గుర్తింపు: ఒకడు జైలుకు.. మరొకడి కోసం వేట**

**రూ. వేల విలువైన బైక్ స్వాధీనం**

**నంది పత్రిక కర్నూలు క్రైమ్** తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు రట్టు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని కన్నం వేసిన నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

**పెళ్లికి వెళ్తే.. కొల్లగొట్టారు!** పోలీసుల కథనం మేరకు.. కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడుమూరు రోడ్డు, హోసన్న మందిర్ సమీపంలో నివసించే శోభారాణి గత నెలలో తన కుటుంబంతో కలిసి అనంతపురంలో జరిగే ఒక వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్లారు. ఇల్లే ఏమార్పుగా ఉండటాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు, అర్ధరాత్రి వేళ ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి 30 తులాల వెండి ఆభరణాలతో పాటు, ఇంటి బయట పార్క్ చేసి ఉన్న సుజుకి జూపిటర్ మోటార్ సైకిల్‌ను కూడా దొంగిలించుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో వేట..** ఈ చోరీ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. రంగంలోకి దిగి అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీ కెమెరాల ఫుటేజీలను జల్లెడ పట్టారు. ఈ దర్యాప్తులో దొంగతనానికి పాల్పడింది తెలంగాణ రాష్ట్రం పరిగి, కుల్కచర్ల ప్రాంతాలకు చెందిన అంతర్రాష్ట్ర దొంగలు అరుణ్ కుమార్, యామిన్‌లుగా నిర్ధారించారు.

**రిలయన్స్ మార్ట్ వద్ద దొరికిపోయాడు!** నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. శనివారం (నిన్న) కోడుమూరు రోడ్డులోని రిలయన్స్ మార్ట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు యామిన్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి చోరీకి గురైన ఆ్రా 40 ఆౢఖ 8012 నంబర్ గల సుజుకి జూపిటర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గౌరవ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కర్నూలు సబ్ జైలుకు తరలించారు.

**మరో నిందితుడి కోసం గాలింపు:** ఈ కేసులో ప్రధాన నిందితుడైన అరుణ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు. అతి త్వరలోనే అతడిని కూడా కటకటాల్లోకి నెడతామని హెచ్చరించారు.

# యోగా తో సంపూర్ణ ఆరగ్యం..

**పోలీస్ పెరేడ్ మైదానం లో అంతర్జాతీయ యోగా దినోత్సవం -2026 కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్ )శ్రీ కే.ప్రకాష్ బాబు**



**వై.ఎస్.ఆర్ కడప జిల్లాలినంది పత్రిక ప్రతినిధి కడప జూన్ 21:** యోగా ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్ )శ్రీ కె. ప్రకాష్ బాబు గారు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర -2026 సందర్భంగా ఆదివారం ఉదయం పోలీస్ పెరేడ్ మైదానం లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ కె. ప్రకాష్ బాబు విచ్చేసి స్వయంగా యోగాసనాలు వేసి సిబ్బంది లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గారు మాట్లాడుతూ పూర్వ కాలంలో ఎవరూ అస్పత్రులకు వెళ్లే వారు కాదని, సంప్రదాయ జీవన విధానం తో ఆరోగ్యం గా జీవించే వారని తెలిపారు. యోగాను తమ జీవితం లో అంతర్భాగంగా చేసుకోవడం వల్ల అనారోగ్యం దరి చేరేది కాదన్నారు. నేటి ఉరుకు పరుగుల జీవన శైలి నేపథ్యంలో దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని పోలీస్ అధికారులు, సిబ్బంది కి సూచించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు, ఆయుష్ శాఖకు చెందిన ఎ. పెంచల ప్రసాద్, కె. సాయి దర్శినిలకు జిల్లా పోలీస్ శాఖ తరపున అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శ్రీ కె. ప్రకాష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. యోగా మాస్టర్ ఎ.ఆర్ కానిస్టేబుల్ సుబ్బయ్య ను అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శ్రీ కె. ప్రకాష్ బాబు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (ఎ.ఆర్ ) శ్రీ బి. రమణయ్య ఆర్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మూడేళ్లలో 5,000 ఆలయాల నిర్మాణం





**కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

**చిత్తూరులో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం**

**నూతన ఆలయాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం భారీ ప్రోత్సాహం**

**స్థలాన్ని బట్టి రూ. 20 లక్షల నుండి రూ. 40 లక్షల వరకు నిధులు మంజూరు**

**నంది పత్రిక కల్లూరు** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకు మరియు సనాతన ధర్మ రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ స్పష్టం చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా కొంగారెడ్డిపల్లి నందు నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన, మహా కుంభాభిషేక మహోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఆలయాల నిర్మాణానికి 'శ్రీవాణి ట్రస్ట్' విప్లవాత్మక నిర్ణయంలి

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో రానున్న మూడేళ్లలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఐదు వేల (5,000) నూతన ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని చైర్‌పర్సన్ వెల్లడించారు. ఏపీలో ఏదైనా గ్రామంలో కొత్తగా ఆలయాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఆలయ నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వివరాలను ఆమె ఈ క్రింది విధంగా ప్రకటించారు.

**స్థలం విస్తీర్ణం । ప్రభుత్వం మంజూరు చేసే నిధులు ।**

10 సెంట్ల లోపు స్థలంలి । లిరూ. 20 లక్షలు ।

। 15 సెంట్ల స్థలంలి । లిరూ. 30 లక్షలు ।

। 20 సెంట్ల స్థలంలి । లిరూ. 40 లక్షలు ।

గ్రామాల్లో నిర్మించబోయే ఆలయం రామాలయమా, శివాలయమా లేదా అమ్మవారి దేవాలయమా అనేది పూర్తిగా స్థానిక భక్తుల నిర్ణయం మేరకే ఉంటుందని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో గుర్తించి, ఎమ్మెల్యేలు, ఎంపీల ద్వారా జిల్లా కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపి ఈ నిధులను పొందవచ్చని సూచించారు. లబ్ధిదారులందరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భజన మందిరాలు, ఆలయాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

**విశ్వబ్రాహ్మణులకు పథకాలు** విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మీవీజు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీలు, సంక్షేమ పథకాలను కులబాంధవులంతా ఉపయోగించుకుని ఆర్థికంగా స్థిరపడాలని కమ్మరి పార్వతమ్మ ఆకాంక్షించారు. ప్రముఖుల సమక్షంలో వైభవంగా వేడుకలు:ఈ మహోత్సవంలో పుండరీక వరదానంద స్వామి, ప్రముఖ అర్చకులు సురేష్ ఆచారి, రాజేంద్ర ఆచారి, చంద్రశేఖర్ ఆచారి, రూపేష్ ఆచారి, హేమచంద్ర ఆచారి, దయానంద్ ఆచారిలతో పాటు చిత్తూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యోగా ద్వారా మానసిక ఆరోగ్యం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 21** : నిత్యం యోగాను సాధన చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రధాన ఉపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాల నందు ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి యువ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి హార్మోన్ స్థాయి తగ్గి మనసు ప్రశాంతంగా మారుతుందని అన్నారు. ఆసనాలు వెన్నెముకను దూడ పరుస్తాయని, ప్రాణాయామం చేయడం వల్ల శరీరాన్ని మనసును ఆరోగ్యంగా ఉంచుతాయని అన్నారు. పిల్లలకు బాల్యం నుండే తల్లిదండ్రులు యోగ్యాసాన్ని ఒక అలవాటుగా చేయించాలని విజ్ఞప్తి చేశారు.

# వేంపల్లి శ్రీనివాస స్కూల్ పై వ్యతిరేకంగా ఆర్జేడీ కార్యాలయం మీద ధర్నా



**ఆర్ ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యుడు గురు మోహన్. డిమాండ్**

**కడప నంది పత్రిక ప్రతినిధి** వేంపల్లి పట్టణంలోని శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం పాఠశాల పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని. రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజుల నుంచి పోరాటాలు చేస్తున్న కూడా పట్టించుకోని ఎంఈఓ పై అలాగే యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని రేపు అనగా సోమవారం ఆర్జెడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఆర్ ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యుడు గురు మోహన్ మీడియా సమావేశంలో తెలిపారు.. ఈ సందర్భంగా ఆర్ ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యులు గురు మోహన్. మాట్లాడుతూ వేంపల్లి మండలంలో ఉన్న శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు ఒకచోట అనుమతుంటే మరొకచోట 3 అంతస్తులు బిల్డింగులు ఒక అపార్ట్మెంట్ లో పాఠశాల నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మూడంతస్తుల బిల్లింగ్ సంబంధించి ఫైర్ ఎన్ ఓ సి లేకుండానే పాఠశాల నిర్వహించడం చాలా బాధాకరమైన విషయం. అందులో భాగంగానే శ్రీనివాస పాఠశాలలో పాఠ్యపుస్తకాలు కూడా అంగట్లో పుస్తకాల అమ్మి నెట్టు బడిలో పుస్తకాల అమ్ముతున్నారు. హాస్టల్ కు విద్యాశాఖ అధికారులు ఎటువంటి పర్మిషన్ ఇవ్వనప్పటికీ మా దగ్గర హాస్టల్ ఉంది. అని చెప్పి హాస్టల్ నిర్వహణ కోసం విద్యార్థుల దగ్గర వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ఉల్లంఘిస్తూ 20 నుంచి 30 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించి విద్యార్థులను తమ పాఠశాలలో కు అడ్మిషన్లు చేసుకుంటూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు... ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేరు కావున ఒకసారి పరిశీలించి చట్టబద్ధమైన చర్యలు ఆ పాఠశాలపై తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ యస్ యూ) గా విజ్ఞప్తి చేస్తున్నాము... అందులో భాగంగానే ఆర్ జెడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు... ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు నాయకులు వంశీ .రాఘవ. మణి. కిరణ్ పాల్గొన్నారు

# వైఎస్ఆర్ స్మృతివనంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ఆత్మకూరు జూన్ 21 (నంది పత్రిక (ప్రతినిధి):**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం (జూన్ 21న) డాక్టర్ వైఎస్ఆర్ స్మృతివనంలో యోగా కార్యక్రమం డిప్యూటీ డైరెక్టర్, వారి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని, మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నిరంతరం ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే అటవీ శాఖ సిబ్బందికి యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఉత్సాహంగా పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది. ఈ వేడుకల్లో వైఎస్ఆర్ స్మృతివనానికి చెందిన అటవీ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు కార్యాలయ ఉద్యోగులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా నిపుణుల మార్గదర్శకత్వంలో సిబ్బంది అంతా కలిసి పలు రకాల ఆసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానం (మెడిటేషన్) చేశారు. ప్రకృతి ఒడిలో సాగిన ఈ యోగా సాధన సిబ్బందిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమం అనంతరం అటవీ శాఖ సిబ్బంది అంతా కలిసి పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యకరమైన జీవనశైలికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్మృతివనం ఉన్నతాధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, గార్డులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**నంద్యాల బ్యూరో, జూన్ 21 :-** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో నేడు (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# మొహరం పండగకు సన్నాహాలు





**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 21:** మొహరం.. ఈ పేరు వినగానే పీర్లు, నిప్పుల గుండాలు, గుండెలు బాదుకుంటూ,' మాతం' చదవటాలు గుర్తుకు వస్తాయి. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహరం అరబ్బీ క్యాలెండర్ మొదటి నెల. దీనినే ఇస్లామిక్ సంవత్సరాదిగా పరిగణిస్తారు. ప్రాచీన కాలంలో అఘోర దినం అనగా మొహరం యొక్క పదవ తేదీని అనేక సాంప్రదాయాల గుర్తులకు అనుగుణంగా పండుగను జరుపుతారు. 14వ శతాబ్దం క్రితమే ప్రజాస్వామ్యం కోసం మానవ హక్కుల కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహరం. ఈ పండుగను ముస్లింలే కాక అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవడం ఏళ్ల తరబడి నుండి జరుగుతూ ఉంది. గ్రామాలలో మూడు రోజులపాటు ఈ పండుగను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామాలలో కొలువుదీర్చే ముందు పీర్ల పెట్టెలను గ్రామాలలో ఊరేగిస్తారు. ఊరేగింపు అనంతరం పీర్లను కొలువు తీరుస్తారు. బండి ఆత్మకూరు మండలంలో బండి ఆత్మకూరు, పార్నపల్లి, ఏ కోడూరు ఈర్నపాడు, కడమల కాల్వ, గ్రామాలలో మొహరం పండుగను నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బండి ఆత్మకూరులో శనివారం రాత్రి పీర్లపెట్టేలను సన్నాయి మేళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈర్నపాడు, కడమల కాల్వ, పార్నపల్లి, బండి ఆత్మకూరు, ఏ కోడూరు గ్రామాలలో పీర్లు కొలువు చేశాయి. ఈనెల 24న చిన్న సరిగెత్తు, 25న మధ్య సరిగేత్తు, 26న పెద్ద సరిగెత్తు నిర్వహించిన అనంతరం 27వ తేదీన గ్రామాలలో పేర్లను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా జరిగే మొహరం వేడుకలకు సంబంధించిన సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు ఇప్పటికే నిఘా వేసి పరిశీలిస్తున్నారు.

# యోగాతో మానసిక ఉల్లాసం..

## ఎంపీడీవో గోపికృష్ణ,



**జూపాడుబంగ్లా జూన్ 21 (నంది పత్రిక)** మనిషి దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనిషిగా ఉల్లాసం లభిస్తుందని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ యోగ శారీరిక మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మనసుకు ప్రశాంతత సంపూర్ణ ఆరోగ్యము సిద్ధిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. మన దేశానికి పరిమితమైన యోగాన్ని 2014లో ప్రధాని మోదీ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. ప్రతి ఒక్కరు యోగా ప్రయోజనాలు పొందాలని సత్యం కల్పంతో ప్రభుత్వం యోగాంధ్రకు శ్రీకారం చుట్టిందన్నారు. యోగ శరీరాన్ని మనసును సమన్వయం చేయడం ద్వారా మంచి జీవనం అలవాటుడేలా చేస్తుందన్నారు. యోగాతో మానసిక ఉల్లాసం.. డిప్యూటీ తాసిల్దార్ ఎన్. నాగన్న మాట్లాడుతూ మనిషి దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనిషిగా ఉల్లాసం లభిస్తుందని యోగ శారీరిక మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మనసుకు ప్రశాంతత సంపూర్ణ ఆరోగ్యము సిద్ధిస్తుందిన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు తో యోగాసనాలు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో యోగ తడసనం, వృక్షశాసనం, త్రికోణాసనం, మకరాసనం, భుజంగాసనం, చక్రసనం, వజ్రాసనం, నాడి శోధన, ప్రాణామయాలు, మరియు ఇతర అసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆస్తులను అమ్మేందుకు సిఎస్ఐ స్కూల్ ను నిర్వీర్యం చేసిన బిషప్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి..

**ఎయిడెడ్ స్కూల్ నడపడం చేతకాకపోతే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి!**

**నిర్లక్ష్యానికి గురికాబడిన సిఎస్ఐ హైస్కూల్ ను పరిరక్షించుకుందాం!**

**-సిపిఐ, ఏఐయస్ఎఫ్**



**కడప నంది పత్రిక ప్రతినిధి జూన్ 21** 150 ఏళ్ల చరిత్ర కలిగిన సిఎస్ఐ హైస్కూల్ ప్రాంగణ స్థలాలను అక్రమంగా అడ్డగోలుగా లీజులకు ఇస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు గత నాలుగేళ్లుగా స్కూల్ అభివృద్ధికి ఆటంకాలు కల్గచేస్తూ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేయకుండా విద్యార్థుల అడ్మిషన్లకు ఆటంకాలు కలుగజేస్తూ స్కూలు ఆస్తులను క్రమేపి అక్రమార్కులకు కట్టబెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర చేసిన సంబంధిత బిషప్ ,యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకట శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తల శివతేజ, ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సిఎస్ఐ హైస్కూల్ ప్రాంగణాన్ని, తరగతులను పరిశీలించారు. విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడి విద్యా సంబంధిత సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట శివ, శివతేజ ,భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం 150 ఏళ్ల క్రితం క్రైస్తవ లండన్ మిషనరీలు ఏర్పాటుచేసిన సి ఎస్ ఐ హై స్కూల్ ను దినదినాభివృద్ధికి తోడ్పడకుండా నాలుగేళ్లుగా గొంతు నలిపి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయించకుండా, లేకపోతే విద్యార్థుల సంఖ్యకు అవసరమగు విద్యా వాలంటీర్లను సైతం ఏర్పాటు చేయకుండా క్రమేపి విద్యార్థుల అడ్మిషన్లకు ఆటంకాలు కలిగించే పద్ధతిలో స్కూల్ ప్రాంగణ వాతావరణాన్ని కలుషితం చేసిన సంబంధిత యాజమాన్యం బిషప్ వైఖరి సహించరానిదన్నారు. నాలుగేళ్లుగా ఈ ఎయిడెడ్ స్కూల్ ను నిర్వీర్యం చేస్తుంటే, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుంటే సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి సక్రమంగా చదువు అందించకపోతే ప్రభుత్వము లేదా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి స్కూల్ ను విలీనం చేసుకొని పాఠశాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. స్కూల్లో అడ్మిషన్లు చేర్చుకునేందుకు కూడా యాజమాన్యం అడ్డంకులు సృష్టిస్తూ క్రమేపి సిఎస్ఐ స్కూల్ ను మూసివేసి ఆ ప్రాంగణ స్థలాలను ప్రైవేట్ కార్పొరేట్ లకు కమర్షియల్ గా లీజులుకు లేదా అమ్మేందుకు అక్రమంగా అడ్డగోలుగా వ్యవహరిస్తుండటం దుర్మార్గకరమన్నారు. సుదీర్ఘ చారిత్రాత్మక చరిత్ర కల్గి ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన సిఎస్ఐ హైస్కూల్ పరిరక్షణకు పూర్వ విద్యార్థులు, అఖిలపక్ష ప్రజా సంఘాలు తదితరులంతా సంసిద్ధం కావాలన్నారు. సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి స్కూల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆందోళన తప్పదన్నారు.

# రైతులకు నష్టం కలిగించే యాప్ విధానం రద్దు చేయండి.

**పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు ఇవ్వండి.**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామ చంద్రుడు డిమాండ్**



**బేతంచెర్ల జూన్ 21 ( నంది పత్రిక )** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టడం కోసం సాకుగా చెప్పి, యాప్ విధానం ద్వారా ప్రతి రైతుకు యూరియా మరియు డీఏపీలును మూడు దఫాలుగా ఇస్తామని చెప్పే విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంగా వ్యతిరేకిస్తున్నాని, ఈ విధానం వల్ల రైతులకు నష్టం కలుగుతుందని, ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చే సబ్సిడీలను క్రమంగా తగ్గించుకోవడం కోసమే యాప్ విధానం తెచ్చిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంనంద్యాల జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వి .సుబ్బారాయుడు, బేతంచర్ల మండల అధ్యక్షుడు సిహెచ్. మద్దిలేటి స్వామిలు బేతంచర్ల సిఐటియు కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆదివారం మాట్లాడారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వము అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పైఅక్రమంగా చేస్తున్న యుద్ధం వల్ల ముడి సరుకుల ధరలు పెరిగాయన్న సాకుగా చూపి, రైతాంగం వాడే అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలను బస్తాకు నూట యాభై రూపాయల నుండి 6వందల రూపాయల వరకు పెంచి, రైతులపై భారం మోపింది. వీటికి తోడు పెట్రోల్ ,డీజిల్ ధరలు పెంచచడం వల్ల,సేద్యపు ఖర్చులు మరియు పంట కోత ఖర్చులు, విపరీతంగా పెరిగిపోతాయని, విత్తనాలు, పురుగు మందుల ధరలు కూడా అకాశాన్ని అంటే విధంగా ఉన్నాయని, రైతులు పండించిన పంటలకు మాత్రమూ ఏ మాత్రం ధరలు పెరగక,రైతాంగం నష్టపోతున్నారు. పండించిన పంటల పెట్టుబడికి సరిపడ విధంగా, ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా మద్దతు ధరలు ప్రకటించక పోగా,తమ ఇష్టం వచ్చినట్లు ప్రకటించిన మద్దతు ధరలచట్టాన్నైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరపడం లేదు. అందుకు అవసరమైన పంటల కొనుగోలు కేంద్రాలు నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేయలేదు. ఫలితంగా నంద్యాల జిల్లా రైతాంగం మొక్క జొన్నలు, వరి దాన్యం, మినుములు అన్ని రకాల పంటలను అతి తక్కువ ధరకు, మధ్య దళారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. అప్పుల భారము,అవమానాలు భరించలేక,ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితి మన జిల్లాలో నెలకొన్నది. ఈ నేపథ్యంలో అమెరికాకు మరియు కార్పొరేట్ కంపెనీలకు లొంగిపోయిన,మోడీ ప్రభుత్వం అమెరికా నుండి మొక్కజొన్న, పండ్లు, పాలు, పత్తి లాంటి పంటలను,ఎలాంటి షరతులు లేకుండా,దిగుమతి చేసుకొనే విధంగా,వాణిజ్య ఒప్పందాలు అమెరికాతో చేసుకోవడం మూలంగా, రాబోయే రోజుల్లో రైతులకు వ్యవసాయము మరింత భారంగా మారుతుందన్నారు.కష్టాల్లో, నష్టాల్లో ఉన్నటువంటి రైతాంగానికి మరిన్ని సబ్సిడీలు పెంచాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెంచకపోగా, ఉన్న సబ్సిడీలను కోత విధించేందుకు,కొత్త గా 2025 వ్యవసాయ చట్టాన్ని తీసుకో వచ్చిందని,అందులో భాగంగానే ఎరువుల పంపిణీకి యాప్ విధానం పెట్టిందన్నారు. ఈ విధానం పూర్తిగా అమలు జరిగితేరైతాంగానికి అవసరమైన అన్ని రకాల ఎరువులు, సకాలంలో అందుతాయన్న గ్యారెంటీ లేదని, కేవలం బలవంతులకు మాత్రమే సబ్సిడీలు అందే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఆర్బికే ల వద్ద, యాప్ లో నమోదు చేసే విధానం అమలు జరుగుతుందని, నమోదు కేంద్రానికి వెళ్ళిన ప్రతి రైతు వద్ద స్మార్ట్ ఫోన్ ఉండాలని, నెట్ బ్యాలెన్స్ ఉండాలని, భూమి రికార్డుల్లో నమోదు చేసిన విస్తీర్ణానికి సరిపడే విధంగా ఆన్లైన్లో పొందుపరిచిన వారికి మాత్రమే ఎరువులు 3 విడతలుగా ఇస్తామని చెప్పడం వల్ల,సకాలంలో ఎరువులు అందక పంట దిగుబడి తగ్గి, రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నది.కావున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రైతులకు నష్టం కలిగించే యాప్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే ఎరువులు పంపిణీ చేయాలి.పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి.పాత ధరలకే రైతులకు సరిపడినంత అన్ని రకాల ఎరువులను రైతులకు సబ్సిడీ ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందించాలని, బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతత కోసం యోగా.





**ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు.**

**యోగా ఉపాసకులతో కలసి ఆసనాలు వేసిన కమిషనర్ హరి ప్రసాద్.**

**బేతంచెర్ల జూన్ 21( నంది పత్రిక )** భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉన్నతాధికారులు మరియు జిల్లా అధికారులు ఆదేశాల మేరకు డోన్ నియోజక వర్గం శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సూచనల మేరకు, యోగాకు ప్రాముఖ్యత కల్పిస్తూ ప్రతి ఒక్కరు ఆచరించి మానసిక ప్రశాంతతతో వ్యాధుల నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యం సాధించు కోవాలని బేతంచెర్ల నగర పంచాయితీ కమిషనర్ హరి ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజావేదిక నందు పట్టణంలోని పురప్రముఖులు, యోగా ఉపాసకులు, విద్యార్థులు,నగర పంచాయితీ సిబ్బందితో కలసినగర పంచాయితీ కమిషనర్ హరి ప్రసాద్ మరియు ఎంపీడీఓ ఫజుల్ రెహమాన్ పాల్గొని ఆసనాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు ఒక గంట సేపు యోగాకు సమయం కేటాయించి,మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందాలని పిలుపు నిచ్చారు.మన ఆరోగ్యానికి యోగా అనేది చాలా అవసరమని, పాఠశాల విద్యార్థులు సైతం యోగా పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు అంటే అది మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు దక్కుతుందన్నారు. పట్టణంలో యోగా చేసేందుకు అందరికీ అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం యోగా గురువులు మద్దిలేటి స్వామి, వెటర్నరీ ఏడి రామ సుబ్బారెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్ ఘనంగా సన్మానించి వారికి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సుమేధ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు మరియు కూటమి నాయకులు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కర్నూలు జిల్లాలో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ





**శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ని మించిన మార్గం లేదు : జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి**

**యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం.**

**ప్రతి కుటుంబం యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి.**

**విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణకు యోగా దోహదపడుతుంది.**

**యోగా కార్యక్రమంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, శారీరక, మానసిక, భావోద్వేగ మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఆదివారం స్థానిక ఎస్.ఏ.పీ క్యాంప్ మైదానంలో కలెక్టర్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా. ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సెట్కూర్ సీఈవో డా.వేణుగోపాల్, జిల్లా పర్యాటక శాఖాధికారి లక్ష్మీ నారాయణ, జడ్పీ సీఈవో రమణా రెడ్డి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డా. ప్రసాద్, నోడల్ ఆఫీసర్ డా. అమర్నాథ్, రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, విద్యా సంస్థల అధినేత కె. వి. సుబ్బారెడ్డి, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ఉదయం కలెక్టర్, ఎస్పీ, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో ఎన్.సి.సి కాడెట్స్, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాదని, మనిషి జీవనశైలిని సక్రమంగా తీర్చిదిద్దే సమగ్ర సాధనమని తెలిపారు. ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న ఒత్తిడులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆందోళనల నుంచి ఉపశమనం పొందడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన మార్గమని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపుతో ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతీయ సంస్కృతికి దక్కిన విశిష్ట గౌరవమని పేర్కొన్నారు.ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు మరియు మహిళా సంఘాల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక యోగా శిబిరాలు, అవగాహన సదస్సులు, సామూహిక యోగా ప్రదర్శనలు నిర్వహించామని వెల్లడించారు.యోగాను ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు అభ్యసించడం ద్వారా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు మరియు వృద్ధులు యోగాను తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఎక్కువ సమయం కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వినియోగంతో గడుపుతున్న నేపథ్యంలో శారీరక చలనం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితుల్లో యోగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఏకాగ్రతను పెంచుతుందని తెలిపారు. విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించడంలో యోగా విశేషంగా దోహదపడుతుందని వివరించారు.ప్రతి కుటుంబం రోజువారీగా యోగా సాధనకు కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలు, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.జిల్లాలో గత 14 రోజులుగా సాగిన యోగా కార్యక్రమాలలో భాగంగా శానిటేషన్ వర్కర్స్ తో థీమాటిక్ యోగా నిర్వహించామని తెలిపారు. రాక్ గార్డెన్స్, కొండారెడ్డి బురుజు వంటి టూరిస్ట్ స్పాట్‌లలో 500 మందితో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఇదే కాకుండా ఆరు దేవాలయాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం యోగాకు సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5,34,000 మంది యోగాకు రిజిస్టర్ చేసుకుని, పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, యోగా సాధన కూడా అందులో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చెబుతున్నదనే కాకుండా, ఆరోగ్యమే మహాభాగ్యమనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని యోగాను జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.యోగాతో ఆరోగ్యం ఆరోగ్యంతో ఆనందం ఆనందంతో అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలోని "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. కర్నూలు జిల్లా ప్రజలందరికీ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.

# వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలి

**యువశక్తి దేశాభివృద్ధికి పునాది - మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, జూన్ 21:-** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమం అనంతరం, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "నశా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తున్న ఈగల్ టీమ్ సేవలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో సిగరెట్, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంతో పాటు మొబైల్ ఫోన్‌లకు అతిగా అలవాటు పడటం, అనవసరమైన వీడియోలు మరియు సోషల్ మీడియా కంటెంట్‌ను అధికంగా వీక్షించడం వంటి చెడు అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. ఇటువంటి వ్యసనాలు వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా దుష్ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత స్నేహితుల ప్రభావంతో తెలియకుండానే ఇలాంటి అలవాట్లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తి జీవితాన్ని, కుటుంబాన్ని, భవిష్యత్తును నాశనం చేసే వ్యసనాలకు దూరంగా ఉండటం అత్యంత అవసరమని ఆమె అన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం, సానుకూల ఆలోచనలు పెంపొందించుకోవడం, విద్య, క్రీడలు, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాల వైపు దృష్టి సారించడం ద్వారా యువత తమ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని సూచించారు. వ్యసనాలకు గురవుతున్న వారిని గుర్తించి వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందించడం, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించేందుకు ఈగల్ టీమ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వ్యసనాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా సమాజం కూడా కలుషితం అవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో యువతతో కలిసి మత్తుపదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత "నశాముక్త్ భారత్ అభియాన్" కింద మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని, తమ జీవితాల్లో ఎటువంటి మత్తు పదార్థాలకు తావివ్వబోమని, కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా ఈ దిశగా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. దేశాభివృద్ధికి యువశక్తి కీలకమని, మార్పు మన నుంచే ప్రారంభం కావాలని, అందరూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా, భారతదేశాన్ని వ్యసనరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు.

# హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌లో ప్రకృతి, ఆధ్యాత్మికత అద్భుతం..

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూన్ 21(నంది పత్రిక):-** ప్రకృతితో మమేకమై, ఆధ్యాత్మికతను అలవర్చుకుని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణం క్రాంతి నగర్ లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పర్యావరణహిత విధానాలు, ధ్యాన సాధన, ప్రకృతి సంరక్షణ చర్యలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థలో అమలు చేస్తున్న దశ నియమాలు, ముఖ్యంగా ఉదయాన్నే లేవడం, హృదయాన్ని ప్రేమతో నింపుకోవడం, ఆధ్యాత్మికత ద్వారా భగవంతునికి చేరువ కావడం వంటి అంశాలు జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రకృతిలో ఏదీ వ్యర్థం కాదని, ప్రతి అంశం మనకు ఒక పాఠాన్ని నేర్పుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక మొక్క నుంచి మరొక మొక్కను సృష్టించడం, నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, వినియోగించిన నీటిని తిరిగి వంట అవసరాలకు, మొక్కల పెంపకానికి ఉపయోగించడం వంటి రీసైక్లింగ్ విధానాలను సంస్థలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే రాలిన ఆకులతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి తిరిగి వ్యవసాయ అవసరాలకు వినియోగించడం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రస్తుత కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు తగ్గిపోవడంతో ఒంటరితనం పెరుగుతోందని, చాలా మంది తమ సమస్యలను ఇతరులతో పంచుకోకపోవడం వల్ల మానసిక, శారీరక అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హార్ట్‌ఫుల్‌నెస్ వంటి సంస్థలు సమాజానికి ఒక మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని అన్నారు. ఇక్కడ అందరితో కలిసిమెలిసి ఉండడం, ప్రకృతిలో సమయం గడపడం, పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం ద్వారా జీవనశైలి సానుకూలంగా మారి ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందని వివరించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవంతో, ఆప్యాయతతో మెలిగే వాతావరణం ఇక్కడ కనిపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని శాంతివనం (కన్హా ఫౌండేషన్)ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలు చేస్తున్న "నెట్ జీరో" భావన, ప్రకృతితో అనుసంధానమైన జీవన విధానం ఎంతో ఆకట్టుకున్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ ఆలోచనలను పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు పరిచయం చేసి, వారి ద్వారా కుటుంబాలకు విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో పెంచేందుకు డీపీఆర్ఎస్ ద్వారా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, గ్రిడ్ మోడల్, బ్లాక్ ప్లాంటేషన్ వంటి ఆధునిక విధానాలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో ప్లాంటేషన్ కార్యక్రమాలతో పాటు కంపోస్టింగ్, ఇంకుడు గుంతల ద్వారా నీటి సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత అభివృద్ధికి తోడ్పడేందుకు సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను మొదటి విడతగా జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాలు, జ్యోతిబా పూలే, అంబేద్కర్ గురుకులాలు తదితర మొత్తం 56 పాఠశాలల్లో అమలు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలులో హార్ట్‌ఫుల్‌నెస్ బృందం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. తక్కువ సమయంలో సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించడం, ప్రతి సమావేశంలో పాల్గొని మార్గనిర్దేశం చేయడం ద్వారా జిల్లాలో పర్యావరణ చైతన్య కార్యక్రమాలకు విశేషంగా తోడ్పడుతున్నందుకు జిల్లా యంత్రాంగం తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్న పిల్లల నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత పెంపొందించేలా వారు స్వయంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే అలవాటును పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ అని, భగవద్గీత సందేశం ప్రకారం ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒకటి నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. సందర్శనలో భాగంగా కొద్దిసేపు చేసిన ధ్యానం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను అందించిందని కలెక్టర్ తెలిపారు. నిరంతరం పని ఒత్తిడిలో ఉండే అధికారులు, ఉద్యోగులకు ధ్యానం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా యంత్రాంగం తరపున హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆవరణలో మామిడి మొక్కను నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా యోగా అభ్యసనం... మంత్రి బీసి





**బనగానపల్లె జూన్ 21 నంది పత్రిక** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా అభ్యసనమును ప్రవేశపెట్టాయని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారము బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు కార్యాలయాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి యోగాబ్యాసనలో భాగంగా ప్రజలతో కలిసి పలు యోగాసనాలు మంత్రి ఆచరించారు ఈ యోగాంధ్ర కార్యక్రమానికి ఉదయమే బనగానపల్లె ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులు, కూటమి పార్టీ నేతలు కార్యకర్తలు తరలివచ్చి యోగ అభ్యసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల శారీరక, మానసిక ఆరోగ్య వికాసానికి యోగ ఒక అద్భుతం సాధనంయోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదు.. ఆధ్యాత్మిక సమతుల్యతను సాధించే జీవన విధానం,యోగాంధ్ర స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు యోగ సాధనను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు.



# ట్రంప్ అబద్ధాల కోరు, మిత్ర ద్రోహి.. ఇటలీ ప్రధాని మెలోనీ ఫైర్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన మిత్రురాలి నుంచే ఊహించని రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. యూరప్‌లో ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా, ఆయన విధానాలకు మద్దతుదారుగా పేరు పొందిన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, ఇప్పుడు ఆయనపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. ట్రంప్ ఒక అబద్ధాల కోరని, మిత్రులను కాదని శత్రువులకు వంత పాడతారని ఆమె తీవ్రంగా విమర్శించారు. అంతేగాక నవంబర్ మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పడిపోతున్న తన పాప్యులారిటీని చూసుకోవాలంటూ ట్రంప్‌కు చురకలు అంటించారు. జీ7 దేశాల నేతల్లో మరెవరూ చేయని సాహసాన్ని మెలోనీ చేయడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం ఎంతో ఉత్సాహభరితంగా ముగిసిందని ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై పలువురు నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా, చివరికి అంతా సర్దుకుపోయారు. కానీ, సమావేశం ముగిసిన వెంటనే మెలోనీ నేరుగా ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో, మయామిలో జరగాల్సిన యూఎస్-ఇటలీ బిజినెస్ ఫోరమ్‌ను ఇటలీ విదేశాంగ శాఖ రద్దు చేసింది. ఈ ఫోరమ్‌లోనే అమెరికా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పాక్స్ సిలికా' అనే కీలక ఖనిజాల ఒప్పందంపై ఇటలీ అధికారికంగా సంతకం చేయాల్సి ఉంది. తాజా విభేదాలతో ఈ ఒప్పందం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. నిజానికి 2025లో ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి యూరప్‌లోని చాలా మంది నేతలు ఆయనతో నేరుగా ఘర్షణకు దిగడం నష్టదాయకమని భావిస్తూ వచ్చారు. గతంలో ట్రంప్.. మెలోనీ అందాన్ని పొగిడినప్పుడు, దానిపై విమర్శలు వచ్చినా ఆమె మౌనంగానే ఉన్నారు.

కానీ ఇప్పుడు ఆమె వైఖరి పూర్తిగా మారింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ వంటి నేతలు ట్రంప్‌తో విభేదించినా, సర్దుకుపోయే ధోరణినే ప్రదర్శించారు. కానీ, మెలోనీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. వచ్చే ఏడాది ఇటలీలో జరగనున్న ఎన్నికలే మెలోనీ వ్యూహం మార్చుకోవడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. 'యూరప్‌లో ట్రంప్‌కు కీలుబొమ్మ' అనే ముద్ర తన రాజకీయ భవిష్యత్తుకు నష్టం చేస్తుందని ఆమె గ్రహించినట్లున్నారు.

# యోగాంధ్ర-2026కు నంద్యాల జిల్లా ప్రజల అపూర్వ స్పందన







**జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో సుమారు 4 లక్షల మంది భాగస్వామ్యం**

**యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్ 21(నంది పత్రిక):-** యోగం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలను సమిష్టిగా నిర్వహిస్తూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గత 14 రోజులుగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వృత్తిపరమైన మరియు వ్యక్తిగత జీవితాల్లో సమతుల్యత సాధించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. శ్రీశైలం, మహానంది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమాల్లో ఒక్కో చోట దాదాపు రెండు వేల మంది చొప్పున పాల్గొనడం విశేషమన్నారు. యోగా అసోసియేషన్ల సహకారంతో నిర్వహించిన థీమాటిక్ యోగా కార్యక్రమాలు కూడా ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో సుమారు 4 లక్షల మంది ప్రజలు భాగస్వాములై యోగాపై తమ ఆసక్తిని చాటుకున్నారని వెల్లడించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని కలెక్టర్ పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యోగాను ఆచరిస్తున్నాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "యోగ ఫర్ హెల్దీ ఏజింగ్" కావడంతో ప్రతి ఒక్కరూ తమ వయస్సు, శారీరక పరిస్థితులకు అనుగుణంగా యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువత తప్పనిసరిగా యోగా సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అసెంబ్లీ సమయంలో యోగా నిర్వహిస్తున్నామని, ఇదే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ప్రతిరోజూ యోగా సాధనకు సమయం కేటాయించాలని కోరారు. యోగా ద్వారా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యుత్తమ సంపదలలో ఒకటని పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో పరధ్యానాలు ఉన్నప్పటికీ యోగా మనలోని శక్తిని లక్ష్యసాధన వైపు కేంద్రీకరించగలదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రోజుకు 20 నుండి 30 నిమిషాలు యోగా సాధన చేస్తే తమ లక్ష్యాలను మరింత సులభంగా సాధించగలరని చెప్పారు. నిత్యం బిజీ జీవితాన్ని గడిపే ఉద్యోగులు, అధికారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం, సాయంత్రం లేదా కార్యాలయాల్లో లభించే కొద్ది సమయాన్ని కూడా యోగా సాధనకు వినియోగించుకోవచ్చని సూచించారు. యోగా ఒక రోజు కార్యక్రమంగా కాకుండా జీవితాంతం కొనసాగించే ఆరోగ్యకరమైన అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కనీసం మరో ఐదుగురికి యోగా ప్రాముఖ్యతను వివరించి వారిని కూడా యోగా వైపు ప్రోత్సహించాలని కోరారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగా తెరపిస్ట్ మయూరాసనం, శిరశాసనం, సర్వాంగాసనం, చక్రాసనం, బకాసనం వంటి యోగాసనాలను వేసి ప్రాముఖ్యతను వివరించారు. పాణ్యం మండలం విద్యార్థులు సమన్వయ యోగా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. యోగాంధ్ర-2026 విజయవంతానికి సహకరించిన ఆకాంక్ష యోగా సమితి, అమర యోగ వికాస కేంద్రం, ఇషా ఫౌండేషన్, హార్ట్‌ఫుల్‌నెస్, నేచురోపతి అండ్ యోగా సంస్థలు, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, సత్యసాయి ధ్యాన మండలి, స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. అలాగే 14 రోజులపాటు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, క్రీడా అభివృద్ధి శాఖ, పోలీసు శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి, జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి.. కలిసిన మనసులు - విరిసిన ఆనందం!

**వెలుగోడు జెడ్పీ హైస్కూల్ 2000-2001 టెన్త్ బ్యాచ్ అపూర్వ కలయిక**

**గురువులకు ఘన సన్మానం.. విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని వెల్లడి**



**వెలుగోడు, జూన్ 21 నంది పత్రిక:** "విద్యకు పేదరికం అడ్డు కాకూడదు.. చదువుతోనే సమాజంలో ఉన్నత గుర్తింపు లభిస్తుంది" అని వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చాటిచెప్పారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. దాదాపు 25 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్నేహితులంతా ఒకే చోట కలుసుకోవడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అందరూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

**మహనీయులకు నివాళులు - మరణించిన మిత్రులకు స్మరణ:** రాష్ట్రంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు ముందుగా పాఠశాలలోని మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్, మరియు చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, తమకు పాఠాలు చెప్పి స్వర్గస్తులైన ఉపాధ్యాయులకు, అలాగే తమతో పాటు చదువుకుని దూరమైన సహచర విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

**గురువందనం.. గురువులకు ఘన సన్మానం:** సమావేశంలో భాగంగా పూర్వ విద్యార్థులు తమ వ్యక్తిగత పరిచయాలను, ప్రస్తుత ఉద్యోగ, వ్యాపార వివరాలను పంచుకుంటూ నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమను క్రమశిక్షణతో పెంచి, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు హుస్సైన్, హాఫిజూర్ రెహమాన్, ముజాహిద్ భాష, మోమిన్ వలి, మక్బుల్ భాష, అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ అజీజ్, మొహమ్మద్ అక్బర్, సుల్తాన్ మొహిద్దిన్‌లతో పాటు ప్రస్తుత ఇన్‌చార్జి హెచ్‌ఎం మొయినుద్దీన్‌లను విద్యార్థులు వస్త్రాలు, పూలమాలలు, శాలువాలు మరియు ప్రత్యేక మెమెంటోలతో ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. **పాఠశాల అభివృద్ధికి హామీ:** ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. "విద్యకు పేదరికం ఏనాడూ అడ్డు కాకూడదు" అనే దృఢ సంకల్పంతో ఉన్నామని తెలిపారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు ఆర్థిక, నైతిక సహాయాన్ని అందిస్తామని, తాము చదువుకున్న పాఠశాల ప్రగతికి ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తామని ఈ వేదికగా వారు ప్రకటించారు.

**పాల్గొన్న పూర్వ విద్యార్థులు:** ఈ అపూర్వ కలయిక కార్యక్రమ విజయవంతంలో ఖాదర్ వలీ, సయ్యద్ రషీద్, అబ్దుల్ సలాం, షేక్ బాషా, మాలిక్ భాష, అఫ్సర్ జహాన్, రహీమ్మిస, ఆబెద, ఆరిఫన్, జరీనా, శంషాద్ బేగం, పర్వీన్ సుల్తానా, ఏజాస్ తదితర పూర్వ విద్యార్థులు కీలక పాత్ర పోషించి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళం రూ.50,116




**మహానంది జూన్ 21 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో అమలవుతున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళం అందజేశారు. ఆదివారం విజయవాడకు చెందిన వెంకట సుబ్బారావు దంపతులు శ్రీ మహానందీశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 అందజేశారు. దాతలను ఆలయ పర్యవేక్షకుడు నీలకంఠేశ్వర రాజు అభినందించి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, అన్నదాన బాండు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెలుగోడు ఆర్ఐ సత్యనారాయణ రెడ్డికి ఘన వీడ్కోలు

**ఏడాది పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విజయవంతంగా శిక్షణ పూర్తి**

**తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**సచివాలయంలో తిరిగి విధుల్లో చేరనున్న సత్యనారాయణ రెడ్డి**

**వెలుగోడు, జూన్ 21 నంది పత్రిక:** వెలుగోడు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గా ఏడాది పాటు సేవలందించిన శ్రీ సత్యనారాయణ రెడ్డికి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం (జూన్ 21) సహోద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఆయన, సీసీఎల్ఏ ఉత్తర్వుల మేరకు ఒక సంవత్సరం పాటు రెవెన్యూ ట్రైనింగ్‌లో భాగంగా వెలుగోడు మండల ఆర్ఐగా బాధ్యతలు స్నేహపూర్వకంగా, సమర్థవంతంగా నిర్వహించారు. గత ఏడాది జూన్ 20న ఇక్కడ విధుల్లో చేరిన ఆయన, ఈ ఏడాది జూన్ 20వ తేదీ శనివారంతో తన శిక్షణా కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని రిలీవ్ అయ్యారు.

**కర్తవ్య దీక్షను కొనియాడిన తహశీల్దార్:** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో వెలుగోడు తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్ మాట్లాడుతూ.. సత్యనారాయణ రెడ్డి గడిచిన ఏడాది కాలంలో ప్రజలకు, రైతులకు అందించిన రెవెన్యూ సేవలు ఎంతో అభినందనీయమన్నారు. కార్యాలయ సిబ్బందితో ఎంతో సమన్వయంతో ఉంటూ, వివాద రహితంగా విధులు నిర్వహించారని కొనియాడారు. అనంతరం తహశీల్దార్ మరియు కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

**సచివాలయంలో తిరిగి జాయినింగ్:** ఈ శిక్షణా కాలం ముగియడంతో, సత్యనారాయణ రెడ్డి విజయవాడ (అమరావతి) లోని ఏపీ ప్రభుత్వ సచివాలయంలో తిరిగి తన ఏఎస్ఓ విధుల్లో జాయిన్ కావడానికి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా సహోద్యోగులు ఆయనకు అభినందనలు తెలుపుతూ.. భవిష్యత్తు ఉద్యోగ జీవితంలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది: ఈ వీడ్కోలు సభలో వెలుగోడు మండల సర్వేయర్ ఉపేంద్ర, సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, విలేజ్ రెవెన్యూ అధికారులు మరియు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొని సత్యనారాయణ రెడ్డికి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం..



**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర-2026 ముగింపు కార్యక్రమంలో భాగంగా.. కడప మున్సిపల్ హాకీ స్టేడియంలో యోగాసనాలు**

**పెద్ద ఎత్తున ప్రజలు హాజరై యోగాసనాలతో వెల్లివిరిసిన సనాతన ధర్మ సౌరభం**

**వై ఎస్ ఆర్ కడప బ్యూరో చీఫ్,జూన్ 21 నంది పత్రిక :** మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే.. ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం సిద్ధించడంతో పాటు.. మానసిక వికాసం మన సొంతం అవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు ఆదివారం ఉదయం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు యోగా గురువు బాబా రాం దేవ్ పాల్గొన్న కార్యక్రమం ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తూ.. జిల్లా స్థాయిలో కడప హాకీ గ్రౌండ్ ,మున్సిపల్ స్టేడియం లో యోగాంధ్ర -2026 ముగింపు కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది. కడప నగరపాలక సంస్థ, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగా" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ డా.నిధీమీనా, కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్. భావన, తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకుని నిర్వహించిన ఈ యోగా కార్యక్రమానికి పెద్ద ఎత్తున నగర పౌరులు హాజరై యోగాసనాలు వేయడం.. శుభపరిణామం అన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన మన దేశ ప్రధాని మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భారత దేశ ఖ్యాతిని, సనాతన ధర్మాన్ని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాలను,ఆరోగ్య సూత్రాలను దేశ ప్రజలకు, భవిష్యత్ తరాలకు అందించాలనే సత్ సంకల్పం తో 12 ఏళ్లుగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నినిర్వహిస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు యోగాంధ్ర 2026 కార్యక్రమం నువివిధ రకాల థీములతో నిర్వహించడం జరిగిందన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు,శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలనుఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమం ద్వారా నగర ప్రజల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ఈ కార్యక్రమం లో ఉత్సాహం గా కుటుంబ సభ్యులు తో కలసి పాల్గొన్నడం ఆనంద దాయకమని తెలిపారు. యోగా ట్రైనర్లు యోగా పై అవగాహన,యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ.. ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలపై అవగాహన కల్పించడం గొప్ప విషయం అన్నారు. ఈ యోగాంధ్ర కార్యక్రమం లో నేర్చుకున్న యోగా ఆసనాలను.. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి నిత్యజీవితం లో భాగస్వామ్యం చేసుకోవాలని,కడప నగరం లో నెలకు కనీసం ఒక్క రోజైన ఇలా సామూహిక యోగా కార్యక్రమాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా జేసీ డా .నిధి మీనా మాట్లాడుతూ...లి ప్రతి ఒక్కరూ



యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా.. క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడు తుందన్నారు. ఈ యోగా కార్య క్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ స్వీయ బాధ్యతగా స్వీకరించి.. సామాజిక ఆరోగ్య పరిరక్షణ కు పాటు పడాలన్నారు. ప్రతి ఇంటిలోనూ ప్రతి గ్రామంలోనూ ప్రతి మండలం లోనూ క్రమం తప్పకుండా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు పెద్ద ఎత్తున కడప నగర పౌరులకు మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన,శిక్షణ ఇవ్వగా.. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, హాజరైన ముఖ్య అతిధులు యోగాసనాలు వేసి జిల్లా ప్రజల్లో స్ఫూర్తిగా నింపారు.

**ఈకార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.**

ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, డిఎమ్ హెచ్ఓ డా.నాగరాజు, డిఎస్‌డిఓ జగన్నాథ రెడ్డి, కడప ఆర్డీఓ మురళి ఆయుష్ నోడల్ అధికారులు, యోగ గురువులు రంగనాథ్ రెడ్డి, ప్రసాద్ టీమ్, తదితర జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, పలువురు ఉద్యోగులు, ఎన్ జీ ఓ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర.

### ముఖ్యఅతిథిగా హాజరైన స్టేట్ డైరెక్టర్ కాటంరెడ్డి.



**శిరివెళ్ల (నంది పత్రిక) :** సిరివెళ్లమండల పరిధిలోని నల్లమల అడవి సమీపంలో గల మహాదేవపురం గ్రామానికి చెందినటువంటి శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర గ్రామ పొలిమేర పరిధిలోని పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి దూపదీప నైవేద్యంతో పాటు మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఇతర ప్రముఖులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర కుటుంబ సభ్యులు మరియు మహదేవపురం టిడిపి ఇన్చార్జి వెలుగోటి మహేష్ యాదవ్, డి చిన్న ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు స్టేట్ డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గారికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం రేచర్ల నాగేంద్ర ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ గ్రామాన్ని పాడి పంటలతో సుఖశాంతులతో చల్లగా చూచే పొలి మీర తల్లి పోలేరమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. టిడిపి యూత్ లీడర్ చిన్న,మధు, శ్రీను, రమేష్, వంశి, శేఖర్, లక్ష్మీకాంత్, పుల్లారెడ్డి, భాస్కర్ ఇతర ప్రముఖులు నాయకులు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## విత్తనం పడింది.... చినుకుల జాడేది....?

**కరుణించని వరుడు...**

**శాంతించని భానులు..**

**ఆకాశం వైపు అన్నదాత చూపు**

**ఈసారి జాడలేని వానలు**

**భూమిలోనే విత్తనాలు ఎండిపోయే ప్రమాదం**

**పత్తి పంట సాగు చేసినా రైతంగం**

**జూపాడుబంగ్లా జూన్ 21 (నంది పత్రిక)** ఆది నుంచి అన్నదాతకు ఆకాశానికి సంబంధం ఉంది. ఎందుకంటే రైతన్నవిత్తనం వేసే ముందు విత్తనము మేసిన తర్వాత కూడా అన్నదాత ఆకాశాన్ని తలెత్తి చూస్తాడు. తొలకరి జల్లు పలకరింపు జరుగుతే విత్తనము విత్తనాలు మొలకెత్తి పుడమి పులకరిస్తుందేమోనని అన్నదాత ఆకాశం వైపు ఆశతో చూస్తాడు. రోహిణి కార్తీ రాగానే రైతులు పత్తి విత్తనాలు నాటడం ప్రారంభించారు. ప్రతి రైతు తొలకరి జల్లులు కురుస్తాయి విత్తిన విత్తనం మొలకెత్తి అంకురమై అవిర్భవిస్తుందన్న ఆశతో పత్తి విత్తనాలు 80% రైతులు నాటారు. :-ఆకాశాన్ని చూస్తున్న అన్నదాత.. రైతులు పత్తి విత్తనాలు నాటారు కానీ. తొలకరి జల్లుల జాడ కరువైనది. మే నెల 25న రోహిణి కార్తీ కుటుంబం కాగానే అధిక ధరలు కలిగిన పత్తి విత్తనాలు తెచ్చి రైతు విత్తనాలు పొలంలో నాటాడు. కానీ గత 20 రోజులుగా ఒక్క చినుకు జడ లేదు. దాంతో విత్తిన విత్తనం మొలకెత్తుతుందా లేదా బాధతో అన్నదాత ప్రతిరోజు నాటిన విత్తనము మొలక వచ్చిందా లేదా అని పొలము వద్దకు వెళ్లి చూస్తున్నాడు. కూలీలకు ఒక్కొక్కరికి రూ 400 కూలి, టాక్టరుతో సేద్యం చేసినందుకు ఖర్చు ఇలా పెట్టుబడి మీద పడుతుందేమోనని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. గత సంవత్సరం తొలకరి వర్షాలు సమయానికి పడి విత్తనాలు మొలకెత్తాయి. రోహిణి కార్తీ పోయి మృగశిర కార్తి అంతిమ దశకు చేరుకున్న ఒక చినుకు జాడ లేక అన్నదాతలో విత్తనాలు వృధా అవుతాయేమో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు నాటిన వర్షాలు లేకపోవడంతో రైతులు అల్లం కరుణిస్తుందా లేదా అని ఆకాశం వైపు అలుపు పెరుగక చూస్తున్నారు.



## శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కల్యాణ మండపం పనులు ప్రారంభం



**బనగానపల్లె జూన్ 21నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణం నందు నూతనం గా శ్రీ సాక్షిమాత శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపము పనులను మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి సతీమణి బీసి ఇందిరమ్మ ఆదివారం ప్రారంభించారు. ఇక్కడ కల్యాణ మండపం నిర్మించుటకు గాను గత నెల 30న మంత్రి బి .సి జనార్ధన్ రెడ్డి 3 కోట్ల 60 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో బీసి ఇందిరమ్మ నిర్మాణ పనులను ప్రారంభించారు .కార్యక్రమం లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి . శ్రీనివాస రెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి ఆలయ అర్చక వేదపండితులు పాల్గొన్నారు . ఆలయం ఆవరణలో కళ్యాణ మండపం నిర్మించడం చాలా ఆనందదాయకం అని భక్తులు,గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లాలో నీట్ పునః పరీక్షలు ప్రశాంతంగా ముగింపు

**కట్టుదిట్టమైన భద్రత మధ్య నీట్ రీ-ఎగ్జామినేషన్ నిర్వహణ**

**1,521 అభ్యర్థులు కేటాయింపు - 1,401 మంది హాజరు**

**అవాంఛనీయ సంఘటనలు లేకుండా నీట్ పునః పరీక్షల నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్ 21(నంది పత్రిక):-** జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పునః పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం, జిల్లాలో మొత్తం 1,521 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1,401 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారన్నారు.

**అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:**

కేటాయించిన పురుష అభ్యర్థులు - 432 మంది

కేటాయించిన మహిళా అభ్యర్థులు - 1,089 మంది

హాజరైన పురుష అభ్యర్థులు - 407 మంది

హాజరైన మహిళా అభ్యర్థులు - 994 మంది

మొత్తం హాజరైన అభ్యర్థులు - 1,401 మంది

గైర్హాజరైన అభ్యర్థులు - 120 మంది మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, దివ్యాంగ (పి.డబ్ల్యు.డి.) అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కేటాయించి సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆన్సర్ షీట్లను నిర్దేశిత భద్రతా నిబంధనల ప్రకారం పోస్టల్ వ్యవస్థ ద్వారా సంబంధిత అధికారులకు పంపించే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు తాగునీరు, బిస్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు

**బనగానపల్లె జూన్ 21నందిపత్రిక** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గల యోగ ఆశ్రమంలో యోగా గురువైనటువంటి సుబ్రహ్మణ్యం గురువు ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం అయినది. ఈ సందర్భంగా గురువు మాట్లాడుతూ మానవ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు మరియు వాసవి జాగృతి సెక్రటరీ గుండా సుప్రజ మరియు శ్రీరామ సుబ్రహ్మణ్యం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు యోగ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్-2026 పరీక్షలు





**91.3 శాతం హాజరు నమోదు**

**పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్: జూన్ 21, నంది పత్రిక** జిల్లాలో నీట్-2026 ప్రవేశ పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆదివారం ఉదయం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. తదుపరి జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను పరిశీలించి, ఏమైనా కాల్స్ వచ్చాయా అని డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి భీమవరం డి.ఎన్.ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 11.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాలలోకి అభ్యర్థులను అనుమతించడంతో విద్యార్థుల భద్రతా తనిఖీలు, స్కానింగ్ ప్రక్రియ, ప్రవేశ నిబంధనల అమలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అలాగే పరీక్షా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటరింగ్ వ్యవస్థను తనిఖీ చేసి, పరీక్షా హాల్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, ఎలాంటి ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. వాటిలో భీమవరంలో రెండు, తాడేపల్లిగూడెంలో ఒకటి, తణుకులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,475 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 2,262 మంది పరీక్ష రాసినట్లు, తద్వారా 91.3 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్న కలెక్టర్, అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది నియామకం, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తణుకు పట్టణంలోని పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్ బాయ్స్, జె.ఎస్.ఎం.ఎల్ జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కూడా జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా హాల్స్‌ను పరిశీలించి, అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న చర్యలపై చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ప్రత్యక్ష దృశ్యాలను పరిశీలించి పరీక్షల నిర్వహణ తీరును సమీక్షించారు. జిల్లాలో నీట్ పరీక్షలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ, వైద్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది, పరీక్షా నిర్వాహకులు, సంబంధిత శాఖల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ తనిఖీల సందర్భంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, డీఎస్పీ రఘువీర్ విష్ణు, పరీక్షల కోఆర్డినేటర్ వి.అనురాధ, సీహెచ్ ఏడుకొండలు, చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ బి.జ్యోతి, శ్రీమతి కె.ఉషారాణి, సీహెచ్ వి.ఎస్.ఎన్ పద్మావతి, తోట వరలక్ష్మి తదితరులు ఉన్నారు







## మోడల్ స్కూల్ ఆవరణంలో ఘనంగా యోగా దినోత్సవం..

**యోగ సాధన తో ఆరోగ్యం పదిలం::**

**ప్రధానోపాధ్యాయులు ఇస్రాత్ బేగం**



**శిరివెళ్ల::(నంది పత్రిక)** ప్రతిరోజు యోగ ఆసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఇస్రాత్ బేగం తెలిపారు. ఆదివారం నాడు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవంనీ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగ ఆసనాలు ప్రాణాయామం చేసి యోగ ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రాత్ బేగం మాట్లాడుతూ యోగా శారీరిక మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రతి ఒక్కరూ రోజు వారి జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏకాగ్రత క్రమశిక్షణ ఒత్తిడి నియంత్రణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అందరూ కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవం నీ విజయవంతంగా నిర్వహించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో ఘనంగా నిర్వహించిన

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




### యోగా కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాకు ద్వితీయ స్థానం

### ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో ఒక అలవాటుగా చేసుకోవాలి

### జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** సమాజంలో ప్రతి ఒక్కరూ యోగాను ఒక అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యోగ అభ్యసనాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలనే లక్ష్యానికి అనుగుణంగా జిల్లావ్యాప్తంగా గత రెండు వారాలుగా యోగా అభ్యాస కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది రిజిస్టర్డ్ సిటిజన్స్ భాగస్వామ్యంతో నేడు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

భీమవరంలో సుమారు 1,500 మంది పాల్గొనగా యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా అభ్యాసం చేస్తే అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని చెప్పారు. పిల్లలకు చిన్ననాటి నుంచే యోగా అలవాటు చేయడం ద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతుందని అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన బహుమతుల్లో యోగా ఒకటని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రజలు యోగా సాధనపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో యోగా కార్యక్రమాల నిర్వహణలో పశ్చిమగోదావరి జిల్లాకు ద్వితీయ స్థానం రావడం గర్వకారణమని, దీనికి జిల్లా, డివిజనల్ మరియు మండల స్థాయి అధికారులు సమిష్టిగా కృషి చేశారని జాయింట్ కలెక్టర్ అభినందించారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలలో మండల మరియు జిల్లా స్థాయిల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం సాధించడంలో విశేష కృషి చేసిన వివిధ శాఖల జిల్లా అధికారులను ప్రశంసాపత్రాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు, పీడీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై అభ్యాస కార్యక్రమాలు నిర్వహించగా, హాజరైన యోగా సాధకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి, ఇ.నారాయణ, ఆయుష్ పీడీ శ్రీరామ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.వి.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## నేడు (జూన్ 22న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జూన్ 22 తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్రదించవచ్చని సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పిజిఆర్ఎస్ కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమాలను కూడా ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

## జిల్లాలోని 1,626 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌవ్‌లు, వంట పాత్రల పంపిణీ

### అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** జిల్లాలోని 1,626 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఇండక్షన్ స్టౌవ్‌లు, వంట పాత్రల కిట్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహార సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఒకటి లేదా రెండు రోజుల ఆలస్యం సంభవించినా, అంగన్వాడీ కేంద్రాల్లో వంట కార్యక్రమాలు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టౌవ్‌లను ప్రభుత్వం అందజేయడం అభినందనీయమైన చర్య అని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే వేడి ఆహారం, పౌష్టికాహార పదార్థాల తయారీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఈ ఇండక్షన్ స్టౌవ్‌లతో పాటు అవసరమైన వంట సామాగ్రిని కూడా అందజేసిందన్నారు. దీంతో అంగన్వాడీ సేవలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇండక్షన్ స్టౌవ్‌ల వినియోగం, నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై అంగన్వాడీ కార్యకర్తలకు తగిన శిక్షణ అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా ఉపయోగించడం ద్వారా వాటి పనితీరు, మన్నిక పెరుగుతాయని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వం అందజేసిన ఈ సదుపాయాలను బాధ్యతాయుతంగా వినియోగించి, చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి, సిడిపిఓలు లక్ష్మీకాంతం, వాణి విజయరత్నం, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రసాద్, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## భారతీయ ఆధ్యాత్మిక కళ యోగా నేడు విశ్వవ్యాప్తంగా మన్ననలు పొందడం మన అందరికి గర్వకారణం.



### పండుగ వాతావరణంలో జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ-2026 వేడుకలు.

### యోగా ఆసనాలు ఆరోగ్యానికి ఒక దివ్యఔషధం.

### జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ-2026 శుభాకాంక్షలు.

### అందరినీ ఆకట్టుకున్న క్రమశిక్షణతో జరిగిన యోగా అభ్యాసన కార్యక్రమం.

### జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...

### జిల్లా కలెక్టరుతో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు లు పాల్గొన్నారు.

**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** స్థానిక వట్లూరు టిటిడిసి కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ యోగాదినోత్సవం -2026 యోగాభ్యాసనలో కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి యోగా ఆసనాలను వేశారు. జిల్లా కలెక్టరుతో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు, సుప్రసిద్ధ భారతీయ యోగా గురువు శ్రీ రామ్ దేవ్ బాబా యోగా కార్యక్రమాన్ని, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, అంతర్జాతీయ యోగ దినోత్సవ-2026 రాష్ట్ర స్థాయి వేడుకలను ప్రత్యక్ష ప్రసారాలను లైవ్ ద్వారా యోగా అభ్యాసకులు తిలకించారు.

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ , జిల్లా ఇంచార్జి డిఆర్వో ఎల్.దేవకీదేవి, జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి. మల్లిఖార్జున రావు, డిఆర్డిఏ పిడి టి.వి. విజయలక్ష్మి, ఆయుష్ రీజనల్ డిడి డా.పి.కృష్ణవేణి లను, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. యోగాపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, ఫోటో, క్విజ్, వీడియో, స్లోగన్లు, తదితర పోటీలలో గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 23 మందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష, సూచనలు మేరకు గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా యోగా అభ్యసన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక కళ యోగా నేడు విశ్వవ్యాప్తంగా మన్ననలు పొందడం మన అందరికి గర్వకారణం అన్నారు. యోగా మన ఆరోగ్యానికి గొప్ప దివ్యఔషధమని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి యోగా వేపు అడుగులు వెయ్యాలని. పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నామని, నిరంతర కార్యక్రమంగా యోగాను చేసుకుంటూ, ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని అన్నారు. ఇప్పటివరకు నేర్చుకున్న యోగా అభ్యాసనలు నిలిపి వేయకుండా ప్రతిరోజు యోగాభ్యాసం చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రతిరోజు యోగా చెయ్యాలని, తద్వారా శారీరిక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, మేధస్సును కలిగి చదువుపై దృష్టి కేంద్రీకరించడానికి వీలు అవుతుందన్నారు. జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేసారని, ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో జరగబోయే కార్యక్రమాలను విజయవంతానికి సంసిద్ధులుగా కావాలని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ గత సంవత్సరం విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని గిన్నిస్ బుక్కు రికార్డును దక్కించు కోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. ఆరోగ్య వంతమైన భారతదేశం కోసం ప్రధాని, మన రాష్ట్ర ముఖ్యమంత్రి యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రపంచంలో ఏదేశంలో లేని యువత మన దేశంలో ఉన్నారని వారందరినీ ఆరోగ్యవంతులను చెయ్యడం ద్వారా ఆరోగ్య భారతదేశంగా తీర్చిదిద్దాలనేదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు జిల్లా అంతటా పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించు కోవడం శుభ పరిణామం అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, యోగాపై యువత దృష్టి పెట్టి యోగా ఆసనాలను వేసుకుంటే మేధస్సు పెరిగి, ఉన్నత చదువులు చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగా ఆసనాలను ప్రతిరోజు ఆచరిస్తూ, మరో ముగ్గురికి యోగా ఆసనాలు వేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సందీప్ రెడ్డి, జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ, ఇన్చార్జి డిఆర్వో యల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఆయుష్ రీజనల్ డిడి డా. పి.కృష్ణవేణి, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన వాణి శివప్రసాదు, వివిధ శాఖలు జిల్లా, మండల అధికారులు, ఉద్యోగులు, మాస్టర్ ట్రైనర్స్, విద్యార్థిని, విద్యార్థులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

**మహానంది జూన్ 21 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో భక్తురాలు పోగొట్టుకున్న బంగారు గొలుసును దేవస్థానం అధికారులు అందజేశారు. ఆదివారం హైదరాబాద్ కు చెందిన సంగీత కోనేరులో స్నానం ఆచరిస్తూ ఉండగా బంగారు తాళిబొట్ల గొలుసును జారవిడుచుకున్నారు. స్నానం అనంతరం ఈ విషయాన్ని గమనించి ఆలయ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ పర్యవేక్షకుడు సుబ్బారెడ్డి స్థానిక సిబ్బందిచే వెతికించి ఏఎస్ఐ వెంకటేశ్వర్లు చేతులమీదుగా బాధితురాలికి అందజేశారు.



# ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒకే ఒక్క మార్గం





### శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట, ఎస్వీ జూ పార్క్ వంటి చారిత్రాత్మక ప్రాంతాలలో యోగా నిర్వహిస్తూ... అటు ఆరోగ్యాన్ని, ఇటు పర్యాటకాన్ని మన జిల్లాలో ఒకే వేదికపైకి తెచ్చాం

### జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్

### అందరి జీవనవిధానంలో యోగా ఒక భాగం కావాలి

### జిల్లాఎస్పీ ఎల్. సుబ్బరాయుడు

**తిరుపతి, బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒక్కటే మార్గమని, మారుతున్న జీవనశైలి ఆహారపు అలవాట్ల ద్వారా కలిగే రుగ్మతల నుండి ఉపశమనం పొందాలంటే యోగాభ్యాసం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా స్థానిక ఎస్వీ యూనివర్సిటీ తారకరామారావు స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జిల్లాఎస్పీ ఎల్. సుబ్బరాయుడు , జాయింట్ కలెక్టర్ ఆర్ .గోవిందరావు, తిరుపతి ఎస్వీ ,శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీల వైస్ ఛాన్సిలర్లు ప్రొ. నరసింహారావు, ప్రొ. ఉమ,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్,జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్,డిఆర్ఓ జి.నరసింహులతో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అందరితో సమాజ హితం కోసం బాధ్యతగా వ్యవహరిస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, యోగా ఆవశ్యకత విశ్వవ్యాప్తం చేసేలా భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే రీతిలో గత రెండు వారాల నుండి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి ప్రతి ఒక్కరి జీవితంలో యోగ ఒకభాగం అయ్యేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ ఏడాది యోగాంధ్రలో "యోగ ఫర్ హెల్తీ ఏజింగ్ "థీమ్ గా ఎంచుకు మనిషి అవలంభిస్తున్న, జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఎదుర్కొంటున్న మానసిక, శారీరిక రుగ్మతల నుండి ఉపశమనం కలిగించేలా, మనిషి జీవించినంత కాలం ఆరోగ్యంగా బ్రతికేలా యోగ తోడ్పడుతుందన్నారు. ఈ మధ్యకాలంలో 30 సంవత్సరాల యువకులు సైతం గుండె, కిడ్నీ సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రతిరోజు కనీసం ఒక గంట యోగాను అభ్యాసం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. పిల్లలు విద్యార్థి దశ నుండే యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని, అలాగే తమ తల్లిదండ్రులను, తమ చుట్టూ ఉన్న వారిని కూడా ప్రభావితం చేసి యోగాను అభ్యాసం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. గత రెండు వారాల నుండి నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని విశిష్ట ప్రాముఖ్యత కలిగిన షార్, శ్రీకాళహస్తి ఆలయం, చంద్రగిరి కోట, ఎస్వి జూ పార్క్ లాంటి పర్యాటక ప్రాంతాలలో నిర్వహించి యోగ మరియు పర్యాటకాన్ని ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు అందరి జీవనవిధానంలో యోగా ఒక భాగం కావాలని,యోగా ద్వారా ఒక క్రమశిక్షణ గల సమాజం ఏర్పడుతుందని జిల్లా ఎస్పీ. ఎల్.సుబ్బరాయుడు పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను తప్పనిసరిగా అభ్యసించాలన్నారు. యోగా ద్వారా సమాజంలో సానుకూల, ఆరోగ్యకర దృక్పథం అలవడాలన్నారు.యువత విలాస వస్తువులకు లోను కాకుండా సామాజిక రుగ్మతల నుండి బయటపడాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని పాటించి మంచి సమాజాన్ని ఏర్పరచడానికి సహకరించాలన్నారు అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు వై. కుమారి క్రాంతి ఆధ్వర్యంలో దాదాపు గంట పాటు పాల్గొన్న వారందరూ ఎంతో ఉత్సాహంగా యోగాసనాలు వేయడం జరిగింది. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.ఆర్. ఉష,రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ,రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా.పసుపులేటి హరి ప్రసాద్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్,తిరుపతి అడ్మిన్ ,ఏ ఆర్ అడిషనల్ ఎస్పీలు ఏ.శ్రీనివాసులు, శ్రీనివాసరావు,తుడా సెక్రటరీ శ్రీకాంత్, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పర్యాటకశాఖ ఆర్డి రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి జనార్ధన్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ యూనివర్శిటీలకు చెందిన విద్యార్థినీ,విద్యార్థులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## యోగాంధ్రతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం వైపు అడుగులు వెయ్యాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**యోగా ఆసనాలు ఆరోగ్య వంతమైన నవసమాజ నిర్మాణానికి దోహద పడుతుంది.**

**ప్రతి ఒక్కరూ యోగాకు ప్రతి రోజు కొంత సమయం కేటాయించాలి.**

**రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ యోగాంధ్ర-2026 శుభాకాంక్షలు.**

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**





**ఏలూరు బ్యూరో చీఫ్, జూన్ 21 నంది పత్రిక** : విజయవాడ తాడిగడప రాష్ట్ర సమాచార శాఖ మంత్రివర్యులు స్వగృహంలో ఆదివారం 12వ అంతర్జాతీయ యోగాంధ్ర-2026 దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ యోగాంధ్రతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం వైపు అడుగులు వెయ్యాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యోగా ఆరోగ్య వంతమైన నవసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు, నూజివీడు నియోజకవర్గం ప్రజలకు అంతర్జాతీయ యోగాంధ్ర-2026 శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. యోగా ఒక ఆధ్యాత్మిక సాధనం అని, ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి సహాయ పడుతుందన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, యోగా అభ్యాసనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. యోగాతో శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని అందరిలో ఉన్నటువంటి ఒత్తిడిని ఆందోళనను తగ్గిస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేసి ఆరోగ్యమైన, ఆనందకరమైన జీవితాన్ని పొందవచ్చునని తెలిపారు. యోగాకు భారత ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా విశిష్టమైన స్థానాన్ని ఇస్తున్నారని, దీన్ని బట్టి మనం ఆలోచనలు చేసుకోవాలని అన్నారు. ఈ రోజుల్లో పిల్లలు నుండి పెద్దవారు వరకు అనేక రకములు ఒత్తిడిలకు గురి అవుతున్నారని, దీని నుండి మనం మనల్ని కాపాడుకుని, మన పిల్లలు భవిష్యత్తును ఆలోచన చేసి యోగాను ప్రతిరోజు ఆచరించాలన్నారు. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదని ఇది నిరంతరం ప్రక్రియ అని, మన ఆరోగ్యానికి మనమే అత్యంత బాధ్యత తీసుకోవాలని అన్నారు

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 21 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 22వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

# ధర్మకర్తల మండలి సమావేశం





**శ్రీశైలం జూన్ 21(నంది పత్రిక)** దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడుగారి అధ్యక్షతన ధర్మకర్తల మండలి 8వ సమావేశం నిర్వహించబడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనాటి సమావేశంలో మొత్తం 45 అంశాలు చర్చించబడ్డాయి. వీటిలో 34 అంశాలు ఆమోదించబడ్డాయి. మిగతా వాటిల్లో 7 అంశాలను వాయిదా వేయడం జరిగింది. 4 అంశాలు తిరస్కరించబడ్డాయి.సమావేశం ప్రారంభంలో సామాన్య భక్తుల మౌలిక సదుపాయాల కల్పన పట్ల ప్రత్యేకంగా చర్చించడం జరిగింది. క్యూ కాంప్లెక్సు నిర్మాణం, క్షేత్రంలో సామాన్య భక్తుల సౌకర్యాల కేంద్రం ( అమినిటీస్ కాంప్లెక్సు), క్షేత్రపరిధిలో మరిన్ని శౌచాలయాల ఏర్పాటు తదితర అంశాలు చర్చించబడ్డాయి. కాగా సమావేశంలో తీసుకోబడిన ముఖ్యమైన నిర్ణయాల గురించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు వివరించారు. క్షత్రపరిధిలోని పార్కింగ్ ప్రదేశాలు, ఆరుబయలు ప్రదేశాలలో హైమాస్ట్ టవర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది.

దేవస్థానం నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాలకు అవసరమైన మందులు, సూదిమందులు మరియు ల్యాబ్ పరికరాలను ఇ ప్రొక్యూర్మెంట్ ద్వారా కొనుగోలుకై టెండర్లను ఆహ్వానించుటకు తీర్మానించడమైనది. క్షేత్రపరిధిలో నంది మండపం నుంచి ఆర్.టి.సి బస్టాండ్, లాకర్ల షెడ్డు నుంచి గంగాధర మండపం, బస్టాండ్ కూడలి మొదలైనచోట్ల ఆక్టోగోనల్ విద్యుత్ స్తంభాలు, రింగు బ్రాకెట్లు మరియు ఎల్.ఈ.డి విద్యుద్దీపాలను ఏర్పాటు చేయుటకు తీర్మానించడమైనది. గణేశ్‌సదన్ మరియు మల్లికార్జునసదన్ డార్మిటరీలలో రూ. 38,50,000/- అంచనా వ్యయంతో బంకర్‌బెడ్లను ఏర్పాటు చేయుటకు తీర్మానించడమైనది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్మించిన కాటేజీలు, అతిథిగృహాలు, వసతి సముదాయాలు, ప్రధానాలయం, డార్మిటరీలు, క్యూ కాంప్లెక్సు మొదలైనచోట్ల అవసరం మేరకు సివిల్ మెయింటనెన్స్ పనులు మరియు అవసరమైన మరమ్మతులు చేయుటకు తీర్మానించడం జరిగింది. ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచురణలో భాగంగా శ్రీశైలఖండం, శ్రీశైలస్తోత్ర కదంబం, శ్రీశైలఖండాంతర్గత భ్రమరాంబామల్లికార్జునపూజావిధానం గ్రంథాలను పునర్ముద్రించాలని తీర్మానించడం జరిగింది.

పంచమఠాలలో అతీప్రాచీనమైన ఘంటామఠం పునర్మిర్మాణ పనులలో పలు ధపాలుగా లభించిన తామ్రశాసనాలను ఆర్కియాలాజీకల్ సర్వే ఆఫ్ ఇండియా, మైసూరు వారు పరిష్కరించియున్నారు. సదరు శాసనాల వివరాలను గ్రంథరూపములో ముద్రించాలని తీర్మానించడం జరిగింది. జనరల్ మెయింటెనెన్సులో భాగంగా రూ. 5 లక్షల అంచనా వ్యయంతో ఇ ప్రొక్యూర్మెంట్ టెండరు ద్వారా ఎలక్ట్రికల్ మెటిరీయల్ కొనుగోలు చేయుటకు తీర్మానించడం జరిగింది. క్షేత్రపరిధిలో తగిన ప్రదేశాలలో ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ సదుపాయాన్ని కల్పించాలని తీర్మానించడం జరిగింది.



## మాదక ద్రవ్యాల నిరోధానికి సమష్టిగా కృషి చేయాలి...

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**




**వై ఎస్ ఆర్ కడప బ్యూరో చీఫ్,జూన్ 21 నంది పత్రిక:** జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.

ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కొని జిల్లా స్థాయిలో కడప మున్సిపల్ హాకీ స్టేడియంలో జరిగిన యోగాంధ్ర 2026 ముగింపు కార్యక్రమంలో.. ఈగల్ (ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో రూపొందించిన "1972 హెల్ప్ లైన్" పై అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా,కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్. భావనతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. పోస్టర్లను ప్రదర్శిస్తూ "మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతామని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతి ఒక్కరు స్వీయ ప్రతిజ్ఞతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,'ఈగల్' సిబ్బంది, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

**- ఎస్సై జయ శేఖర్**



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామీణ ప్రాంతాలలో అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని ఎస్సై జయశేఖర్ హెచ్చరించారు ఆదివారం మండలంలోని జడ్డువారిపల్లి గ్రామంలో కాటన్ సెర్చ్ నిర్వహించి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. అక్రమంగా మధ్యమమ్ముతున్న మల్లిరెడ్డి బాబు వద్ద 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు గ్రామీణ ప్రాంతాల ప్రజలు అన్నదమ్ములపై కలిసి ఉండాలన్నారు అలాగే ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని ఆయన భరోసా ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 100 మరియు 112 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని ఎస్సై జయశేఖర్ విజ్ఞప్తి చేశారు



# వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కేంద్ర ప్రభుత్వం కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి : ఏఐకేఎంఎస్.






**నందికొట్కూర్ జూన్ 21(నంది పత్రిక )**అఖిలభారత రైతు కూలీ సంఘం నంద్యాల జిల్లా మహాసభ ఆదివారం నందికొట్కూరు లోని అల్వాల వారి సత్రంలో జరిగింది ముందుగా అఖిల భారత రైతు కూలి సంఘం జెండాను సంఘం జిల్లా అధ్యక్షులు వై నరసింహులు ఆవిష్కరించడం జరిగింది. అనంతరం సభను ఉద్దేశించి అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి పా టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్పొరేటీకరించే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయక పోగా వ్యవసాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి హామీలకు భిన్నంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు అనుకూలంగా వివరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ బిల్లు విత్తన బిల్లు ఉపసంహరించాలని జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పోరాడి సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి వివిజి రాంజీ పథకం తీసుకు రావడం పేదల కూలీల ఉపాధిని దెబ్బతీయటమన్నారు .కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా మౌనం వహించడం కూటమి ప్రభుత్వ విధానాన్ని ఆయన తప్పు పట్టారు. వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో 15 రకాల వ్యవసాయ పంటలు పండిస్తున్న ఏ ఒక్క పంటకి గిట్టుబాటు ధర లభించడం లేదని రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. విభజన హామీ సందర్భంగా వెనుకబడ్డ రాయలసీమకు నిధులు నీళ్లు నియమాలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.అమెరికా భారత్ (ఎఫ్ టి ఏ )ఒప్పందం కారణంగా భారతదేశ ఎగుమతులపై 18 శాతం దిగుమతులపై జీరో శాతం విదేశీ దిగుమతుల ఒప్పందం చేసుకోవడం ట్రంపు కాళ్ళ కింద నరేంద్ర మోడీ లొంగిపోవడం అన్నారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు ముబ్బుడు ముబ్బడిగా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు భారత వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తుంది కావున ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి మౌలిక వసతులు కల్పన పేరుతో రోడ్లు, రైల్వేలు ప్రాజెక్టులు నిర్మాణం పేరుతో రైతుల భూములను బలవంతంగా సేకరించే కార్పొరేటర్లకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పేదలకు పంపిణీ చేయడానికి భూమి లేదు గాని కార్పొరేట్లకు ధారాధత్వం చేయడానికి ఎక్కడిది అని ఆయన ప్రశ్నించారు .ఇప్పటికైనా దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరికి భూమిని పంపిణీ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓ పి డి ఆర్ సీనియర్ నాయకులు ఖాజాముద్దీన్ అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి ఆనంద్. జిల్లా నాయకులు బి ఆనందరావు ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పి మజీద్ మియా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక సంక్షేమ వ్యతిరేక విధానాలపై ప్రశాంగించారు. అనంతరం అఖిలభారత రైతు కూలి సంఘం నంద్యాల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా వై నరసింహులు. ఉపాధ్యక్షులుగా బి ఆనంద్. ప్రధాన కార్యదర్శిగా ఎం గోపాల్. సహాయ కార్యదర్శిగా బి ఆనందరావు .కోశాధికారిగా లాలు నాయక్. జిల్లా కార్యవర్గ సభ్యులుగా శంకరయ్య. ఆర్ శివ. ఎల్ల నాయుడు ఆర్ పుల్లన్న . సూర్య చంద్రుడు. మహబూబ్ బాషా. రాజు. అల్లా బకాష్ . తిరుపాలు లను సభ ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.

# ఎస్డిపిఐ18వ ఆవిర్భావ దినోత్సవం: శ్రీశైలం అసెంబ్లీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**వెలుగోడు జూన్ 21 నంది పత్రిక:**సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వెలుగోడు పట్టణంలో ఘనంగా జరిగాయి. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండాను ఎగురవేసి, పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**రాజ్యాంగ పరిరక్షణే పార్టీ ధ్యేయం: లింకన్ రాజు** ఈ వేడుకలకు విశిష్ట అతిథిగా హాజరైన నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు లింకన్ రాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎస్డిపిఐ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తుతూ, ప్రజల హక్కుల సాధనలో పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మరొక జిల్లా కమిటీ సభ్యులు హుస్సేన్ బాషా మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎస్డిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. దేశంలో వస్తున్న సామాజిక మార్పులను గమనిస్తూ, యువత మరింత సామాజిక చైతన్యంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శ్రీశైలం అసెంబ్లీ ఉపాధ్యక్షులు హాఫిజ్ షఫీ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆశయాల కోసమే ఉద్యమాలు సాగాయని వివరించారు. పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న యంగ్ డెమోక్రట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు తౌసిఫ్, ఇంతియాజ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతుల్లో యువత సామాజిక మార్పు కోసం ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగించడమే పార్టీకి నిజమైన బలం అని నాయకులు స్పష్టం చేశారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు** ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కోశాధికారి మొయిన్, కమిటీ సభ్యులు సద్దాం, మునీర్, ఫయాజ్, వివిధ బ్రాంచ్ నాయకులు, వెలుగోడు పట్టణ ప్రముఖులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజారా గుడి పూజారులకు జీతభత్యాలు చెల్లించాలి: బి.డి.ఆర్.ఎస్ డిమాండ్.



**నంద్యాల జూన్ 28 నంది పత్రిక:** నంద్యాల పట్టణంలోని శ్రీ కాశి రెడ్డి నాయన ఆశ్రమంలో బంజారా ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో బంజారా గుడి పూజారుల జిల్లా స్థాయి ప్రతినిధుల సదస్సు ఘనంగా జరిగింది. నంద్యాల జిల్లాలోని వివిధ తాండాల నుండి బంజారా గిరిజన సుగాలి గుడి పూజారులు, సాధు సంతులు ఈ సమావేశానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధాడి కృష్ణా నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు, చర్చిల్లో పనిచేసే పాస్టర్లకు ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్నట్లే.. బంజారా సుగాలి గిరిజన గుడి పూజారులకు కూడా ప్రతి నెలా జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లోని ఆలయాలకు వెంటనే 'ధూప దీప నైవేద్య పథకం' అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభాపతి నేనావత్ హాథీ నాయక్ మాట్లాడుతూ.. ప్రతి తండాలో తప్పనిసరిగా 'భోగ్ భండార్ కమిటీ'ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి శనివారం భోగ్ బండారో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ, బంజారా సుగాలి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందేలా పూజారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గుడి పూజారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకావత్ వెంకట్రావ్ నాయక్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం తండాల్లో పెద్ద ఎత్తున మతమార్పిడులు జరుగుతున్నాయని, అనేకమంది క్రైస్తవంలోకి మారుతుండటం ఆందోళనకరమని అన్నారు. గిరిజనులు ఎవరూ ప్రలోభాలకు లోనై మతం మారకూడదని, మారిన వారంతా తిరిగి స్వధర్మంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.బి డి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కేతావత్ చందు నాయక్ మాట్లాడుతూ.. భారతదేశంలో పుట్టిన ప్రతి జాతి యొక్క సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. గిరిజన పూజారుల జీతభత్యాల కొరకు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను సంబంధిత అధికారులు, మంత్రులకు వినతి పత్రాల రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు."గిరిజనులు ఆర్థికంగా వెనుకబడిన వారు, అమాయకులు. కాబట్టి గుడి రిజిస్ట్రేషన్ అయిందా లేదా, పబ్లికేషన్ జరిగిందా, కమిటీ ఉందా లేదా అనే కఠినమైన నిబంధనలు ఏవీ చూడకుండానే ప్రభుత్వం గిరిజన పూజారులకు జీతభత్యాలు మంజూరు చేయాలి."ఈ కార్యక్రమంలో ఏలూరు నుండి వచ్చిన బి.డి.ఆర్.ఎస్ కమిటీ రాష్ట్ర సభ్యులు వేణు గోపాల్ నాయక్, అనంతపురం నుండి వచ్చిన గోరామ్ సోమశంకర్ నాయక్ లతో పాటు జిల్లా నలుమూలల నుండి వచ్చిన బంజారా భక్తులు, పూజారులు పాల్గొన్నారు.

## ఫాదర్స్ డే స్ఫూర్తి.. ఇద్దరు పిల్లలకు తల్లిగా మారిన ఓ నాన్న కథ!

ఫాదర్స్ డే సందర్భంగా ప్రపంచమంతా తండ్రి గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటుంటే, కోల్‌కతాకు చెందిన సువేందు సర్కార్ జీవితం ఒంటరి తండ్రుల అకుంఠిత దీక్షకు, త్యాగనిరతికి నిలువుటద్దంలా నిలుస్తోంది. జీవితంలో ఎదురైన ప్రతీ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొని, ఇద్దరు పసిపిల్లలకు తల్లీతండ్రీ తానై సేవ చేస్తున్న ఆయన కథ ఎందరికో స్ఫూర్తిదాయకం. ప్రభుత్వ ఉద్యోగి అయిన సువేందు, అటు వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూనే, ఇటు పిల్లల ఆలనాపాలనలో ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నారు. ఆయనకు రెండేళ్ల వయసులోనే సువేందు జీవితం కష్టాలమయంగా మారింది. ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో తల్లిని కోల్పోయారు. ఆ తర్వాత తండ్రి కూడా బాధ్యతను నిరాకరించడంతో బంధువుల ఇళ్లలో తలదాచుకుంటూ పెరిగారు. స్థిరమైన కుటుంబ వాతావరణం లేకపోయినా, పట్టుదలతో చదువుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఆ కలను సాకారం చేసుకునేందుకు హోటల్‌లో క్యాటరింగ్ బాయ్‌గా, మేనమామ మందుల దుకాణంలో సహాయకుడిగా చిన్నాచితకా పనులు చేశారు. ఆయన శ్రమ ఫలించి 2011లో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడ్డారు. 2015లో వివాహం చేసుకున్న తర్వాత ఆయన జీవితం సాఫీగా సాగుతున్నట్లే కనిపించింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మించారు. కానీ, ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. 2021లో యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్-19 మహమ్మారి ఆయన భార్యను బలితీసుకుంది. అప్పుడు ఆయన కుమారుడి వయసు ఒకటిన్నర సంవత్సరాలు, కుమార్తె వయసు కేవలం ఆరు నెలలు. భార్యను కోల్పోయిన దుఃఖం కన్నా, పసిపిల్లల భవిష్యత్తు గురించిన ఆందోళన ఆయన్ను చుట్టుముట్టింది.

# యోగ ద్వారా ఆరోగ్యం పదిలం






**కొత్తపల్లి - నంది పత్రిక :** యోగ ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిప్యూటీ ఎంపీడీవోలు సుబ్బారావు, కే పి ఆర్ శర్మ అన్నారు ఆదివారం మండల కేంద్రంలోని వెన్నెల గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు ఆయుష్ డాక్టర్ జమాల్ మరియు గోకవరం జడ్పీహెచ్ హై స్కూల్ నందు హెడ్మాస్టర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూర్య నమస్కారములు, వ్యాన్యాగ్, యోగాసనంలో, ప్రాణాయామం, ధ్యానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగాసనాలు వేయాలన్నారు.విద్యార్థి దశ నుంచే యోగాసాధన అలవర్చుకుంటే భవిష్యతలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాసనాలు ప్రదర్శించి యువత, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు ఈ కార్యక్రమంలో ఏపీఎం పుల్లయ్య, ఉపాధి హామీ ఎపి వో విమలమ్మా, సచివాలయ సిబ్బంది కేజీబీవీ విద్యార్థులు మరియు గోకవరం ఉపాధ్యాయులు వెంకటస్వామి ,కలిముల్లా , సచివాలయ సిబ్బంది ,శివప్రసాద్,నరసింహారావు ,రామకృష్ణ భక్తకన్నప్ప గురుకులం ఆవాస ప్రముఖ్ తదితరులు పాల్గొనడం జరిగినది.



# ప్రముఖ పుణ్యక్షేత్రం నందలూరు శ్రీ సౌమ్య స్వామి వారి దర్శించుకున్న శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, జనసేన పార్టీ అధికార ప్రతిని కీర్తన...



**నంది ప్రతినిధి, వైయస్సార్ జిల్లా, జూన్ 21.** నందలూరు జనసేన నాయకులు కొట్టే శ్రీ ఆహ్వానం మేరకు వచ్చిన శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన ఎన్డీఏ కుటుంబ నాయకులు భారీగా కన స్వాగతం పలికి సాల్వాలతో సత్కరించి తన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాసేపు ఎన్డీఏ కూటమి నాయకులు స్థానికులతో కొట్టే సాయి ప్రసాద్ కీర్తన ముచ్చటించారు. అనంతరం రాయలసీమలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నందలూరు శ్రీ శోభన్ బాబు స్వామి ఆలయం విచ్చేసి శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మరియు జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు, ఆల ఈవో దిలీప్ దర్శనం ఏర్పాట్లు చేశారు మరియు పరికిశెట్టి కీర్తన సత్కరించి ఆలయ వేద పండితులతో ఆశీర్వచనం అందించారు. అనంతరం శ్రీ సోమనాథ్ స్వామి అన్నదాన సత్రం సందర్శించి అన్నదానం ట్రస్ట్ కు శ్రీ కాళహస్తి ఆలచేరి అన్నదాన ట్రస్టు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ఎన్డీఏ కూటమి నాయకులు, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, హైస్కూల్ చైర్మన్ ఉపేంద్ర, ఉప్పు శెట్టి సుధీర్, మాజీ సర్పంచులు జంబు సూర్యనారాయణ, మెడ పోతుల రాము, గంగాధర్, జిగిలి, హిమగిరి, రెడ్డయ్య, బాలాజీ, కొట్టే రాఘవ, హోటల్ శివ, మోడపోతుల, రామయ్య, మోహన్, మస్తాన్ రాయల్. మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, గోపాల్, రత్నం, పవన్ కుమార్, రాయచోటి చిరంజీవి, యువత అధ్యక్షులు జయరాం, అనంగి హరి చంద్ర, బాల, కొట్టే ప్రదీప్, కొట్టే హరి, తోట సుబ్బయ్య, బద్రి, స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



నంది పత్రిక

సోమవారం 22 - 06 -2026

# కర్నూలు ఆర్డీఓ గారు..

## మీరు ప్రజల సమస్యలు తీర్చడానికా?

## సమస్యల్లోకి నెట్టడానికా?

## బైరెడ్డి వెంకటరెడ్డి ఘాటు విమర్శలు



**ఎంఆర్వో 'ఫోర్జరీ' అన్న ఎంట్రీని..**
**ఆర్డీఓ ఎలా కరెక్ట్ అంటారు?**
**రియల్ ఎస్టేట్ వ్యాపారులతో**
**చేతులు కలిపి ఒంటరి మహిళకు**
**అన్యాయం చేస్తారా?**
**ప్రశ్నిస్తే బ్లాక్‌మెయిల్ అంటారా..**
**అసలు బ్లాక్‌మెయిలర్ ఎవరు?**
**అధికార దుర్వినియోగానికి**
**పరాకాష్ట.. బాధితుల పక్షాన బైరెడ్డి**
**కుటుంబం పోరాటం!**

**నంది పత్రిక కర్నూలు న్యూస్** "ప్రజల సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం మిమ్మల్ని ఉన్నత స్థానంలో కూర్చోబెడితే.. మీరు మాత్రం ప్రజలను సమస్యల్లోకి నెడుతూ, రియల్టర్లతో చేతులు కలిపి అక్రమాలకు ఒడిగడుతున్నారు. క్రింది స్థాయి ఎంఆర్వో స్వయంగా 'ఫోర్జరీ' అని తేల్చిన భూమి రికార్డులను, మీరెలా కరెక్ట్ అని సమర్థిస్తున్నారు ఆర్డీఓ గారు?" అంటూ బైరెడ్డి హరిత బావగారైన బైరెడ్డి వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆర్డీఓ తీరుపై, మజీద్ రియల్ ఎస్టేట్ అక్రమాలపై నిప్పులు చెరిగారు. భర్తను కోల్పోయి, ఇద్దరు పిల్లలతో పేదరికంలో మగ్గుతున్న ఓ ఒంటరి మహిళ (బైరెడ్డి హరిత) న్యాయబద్ధమైన ఆస్తి కోసం పోరాడుతుంటే, ఆర్డీఓ అడుగడుగునా ఇబ్బందులు పెట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు.

**అసలు బ్లాక్‌మెయిలర్ ఎవరు? ఆర్డీఓ గారే!** తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే 'బ్లాక్‌మెయిల్' చేస్తున్నారంటూ ఎదురుదాడికి దిగడంపై వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. "బ్లాక్‌మెయిలర్స్ మేము కాదు, ఆర్డీఓ గారే. 'మీరు నన్ను పర్సనల్ గా కలవాల్సింది' అని ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో మాకు బాగా అర్థమైంది. ఫేక్ ప్రాపగాండాతో ఉన్నతాధికారులను, పత్రికలను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. తప్పు కప్పిపుచ్చుకోవడానికి క్రింది స్థాయి సిబ్బందిని, ప్రశ్నించే ప్రజలను బలిచేస్తున్నారు. ఇలాంటి అధికారుల వల్లే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రికార్డులన్నీ మావే.. దొంగ పాసుబుక్కులతో రియల్టర్ల మాయాజాలం!**

భూమి వివాదానికి సంబంధించిన వాస్తవాలను బైరెడ్డి వెంకటరెడ్డి మీడియా ముందుంచారు: గార్గేయపురం పరిధిలోని సర్వే నంబర్ 619/3లో మొత్తం 57 ఎకరాల భూమి ఉంది. ఇందులో 19.30 ఎకరాలు ఇతరులది కాగా.. మిగిలినదంతా బైరెడ్డి కుటుంబానిదే. దీనికి సంబంధించి 1932 నాటి విభాగ పరిష్కార డాక్యుమెంట్లు, ఆర్ఓఆర్ మ్యానువల్ అడంగల్ వంటి అన్ని రికార్డుల్లోనూ బైరెడ్డి కుటుంబం పేర్లే ఉన్నాయి. ఇందులో 6.5 ఎకరాలు హరితకు చెందాలి. హరితకు అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని మజీద్ రియల్ ఎస్టేట్ మరియు కృష్ణమూర్తి (+.ఖ) లు కలిసి దొంగ పాసు పుస్తకాలు సృష్టించారు. గతంలో కొందరు అధికారుల సహకారంతో ఆన్‌లైన్ అడంగల్/1బి లలో ఎంట్రీలు చేయించుకుని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రీ-సర్వే తర్వాత కూడా లక్ష్మినారాయణ పేరిట 1.63 ఎకరాలు నమోదు చేశారు.

సాగులో ఉన్నందునే ఈ భూమి వచ్చిందని వారు చెబుతున్నారు. అసలు వారు సాగులోనే లేరు, ఒకవేళ ఉన్నా హక్కులు రావడానికి ఇదేమీ ప్రభుత్వ భూమి కాదు.

**ఎంఆర్వో రిపోర్టును బుట్టదాఖలు చేసిన ఆర్డీఓ!**

ఈ దొంగ రికార్డులపై తాము 10 నెలల క్రితమే ఫిర్యాదు చేశామని వెంకటరెడ్డి తెలిపారు. కర్నూలు రూరల్ ఎంఆర్వో గారు దాదాపు 6 నెలల పాటు క్షుణ్ణంగా విచారణ జరిపి, ఇది పూర్తిగా 'ఫోర్జరీ పాసు పుస్తకం, ఫ్రాడ్ ఎంట్రీ' అని నివేదికను ఆర్డీఓ కార్యాలయానికి పంపారు. నెల రోజుల్లో సమస్య క్లియర్ చేస్తామన్న ఆర్డీఓ.. కాలయాపన చేస్తూ, చివరికి రియల్టర్లతో పెద్ద మొత్తంలో చేతులు మారి ఎంఆర్వో రిపోర్టుకు వ్యతిరేకంగా లక్ష్మినారాయణకు హక్కు ఉందంటూ పత్రికా ప్రకటన ఇవ్వడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు.

**కోర్టు కేసుల వెనుక ముందస్తు స్క్రిప్ట్!**

రియల్టర్లకు కోర్టుకు వెళ్ళమని సలహా ఇచ్చింది కూడా ఆర్డీఓనే అని తమకు సమాచారం ఉందన్నారు. ఈ నెల 17న కోర్టులో వేసిన కేసులో కేవలం అధికారులను మాత్రమే పార్టీలుగా చేర్చి, అసలు బాధితులైన తమను చేర్చకపోవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. అధికారులను పార్టీగా చేసుకుంటే మీకు ఫేవర్ గా రిపోర్ట్ ఇస్తామని ముందే మాట్లాడుకున్నారని ఆరోపించారు. లక్ష్మినారాయణ తమకు అమ్మినట్లు, ఆన్‌లైన్ చేయాలంటూ మజీద్ రియల్ ఎస్టేట్ వారు కోర్టుకు వెళ్లగా, దీనిపై ఈ నెల 22న విచారణ ఉన్నట్లు తెలిసిందన్నారు.

**మజీద్ రియల్ ఎస్టేట్ 'అసైన్డ్ భూముల' అక్రమాలు:**

మజీద్ రియల్ ఎస్టేట్ యజమానులు ఇలాంటి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అని వెంకటరెడ్డి ఆరోపించారు. ఇదే గార్గేయపురం గ్రామ రెవెన్యూలోని సర్వే నెం: 748 లో ఉన్న దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని ఆక్రమించి, దానిని తోటగా మార్చి, చుట్టూ కంచె, కాంపౌండ్ వాల్ నిర్మించారని.. దీనిపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక ఒంటరి మహిళ రోడ్డుపైకి వచ్చి పోరాడే పరిస్థితి తెచ్చిన ఈ ఆర్డీఓపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని, తమ ఆస్తి తమకు దక్కే వరకు పోరాటం ఆగదని బైరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు శారీరక దృఢత్వానికి యోగ దోహదపడుతుంది

### ఎంపీడీవో నూర్జహాన్ బేగం



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 21 నంది పత్రిక** యోగా అనేది మానవ నిత్యజీవితంలో ఒక భాగం కావాలని ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ బేగం అన్నారు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం నాడు పట్టణంలోని ఏపీ ట్రైబల్ బాయ్స్ స్కూల్ ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా అనేది ప్రతి ఒక్కరూ నిత్యం ఉదయం కనీసం 30 నిమిషాల పాటు యోగాసనాలు సాధన చేస్తే శరీరం దృఢంగా మారుతుందని ఎలాంటి అనారోగ్య ఇబ్బందులు దరి చేరవని ఆమె తెలిపారు మానసిక ప్రశాంతతకు శారీరక ఫిట్నెస్ కు యోగ ఎంతో దోహదపడుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు యోగా నూతన దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శోభా వివేకవతి ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రమణ్యం పాఠశాల ప్రిన్సిపాల్ చిన్న గుర్రప్ప మెప్మా సిబ్బంది జ్యోతి పూలే రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది వెలుగు సిబ్బంది స్థానిక సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొని యోగాసనాలు చ



## ముద్దవరం గ్రామంలో "గోటు విలేజ్" కార్యక్రమం నిర్వహణ.



**బేతంచెర్ల జూన్ 21( నందిపత్రిక ).** మాదిగ సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన బలం అనే లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బేతంచెర్ల మండలం ముద్ద వరం గ్రామంలో "గోటు విలేజ్" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి & ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ సూచనలతో లిగో టు విల్లెజ్ కార్యక్రమం , లిముద్దవరం గ్రామం లో వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేషు మాదిగ ,ఎం ఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు వల్లంపాటి అనిల్ మాదిగ,ఎం ఆర్పిఎస్ బేతంచెర్ల మండల అధ్యక్షులు అఖిల్ మాదిగ,ఎంఎస్పి బేతంచెర్ల మండల అధ్యక్షులు మధు సుధన్ మాదిగ హాజరై యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ సమాజ భవిష్యత్తు విద్యతోనే మారుతుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నప్పటి నుంచే పాఠశాలకు పంపించి, ఉన్నత చదువులు చదివించాలి అని పిలుపునిచ్చారు. 10వ తరగతి అనంతరం విద్యార్థులు పాలిటెక్నిక్, అగ్రికల్చర్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరాలని, ఇంటర్‌లో ఎంపిసి బైపీసీ , హెచ్‌ఈసి గ్రూపులను ఎంచుకొని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. డిగ్రీలు, పీజీలు, ఎంఫిల్, పీహెచ్‌డీలు చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమంలో , వెంకటేష్, సుబ్బారాయుడు, గోపాల్, సూరి మరియు . గ్రామ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా సి.వి.బి. వి సుబ్బారావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం

**పోరుమామిళ్ల జూన్ 21 (నంది పత్రిక):** ఉపాధ్యాయ వృత్తిలో 42 సంవత్సరాలుగా విశేషమైన సేవలు అందించి పదవీ విరమణ పొందిన సి వి బి వి సుబ్బారావు పి. ఎస్. హెచ్. ఎం ని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల,పోరుమామిళ్ల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయ బృందం, కుటుంబ సభ్యులు మరియు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మరియు సోదర సంఘ నాయకులు, బంధుమిత్రులు కలిసి వాసవి కళ్యాణ మండపం పోరుమామిళ్ల నందు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుబ్బారావు గారు అనేక పాఠశాల అభివృద్ధిలో పిల్లలకు చదువు నేర్పించడంలో క్రమశిక్షణతో పాటు సమయపాలన పాటిస్తూ తనదైన శైలిలో విద్యాబుద్ధులు నేర్పటం జరిగింది. 1984 లో ప్రారంభమైన ఉద్యోగ జీవితం 2026 వరకు నిర్విరామంగా కొనసాగుతూ.. మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోరుమామిళ్ల నందు మే 31 న పదవీ విరమణ పొంది నేడు పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో ఆత్మీయులందరి మధ్య అభినందనలు అందుకోవడం సంతోషదాయకం. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జి . రాజశేఖర్ రెడ్డి, ఎస్.కె. షఫీ, (ఏఐఎఫ్ఈటీవో ) జాతీయ కార్యదర్శి రమణారెడ్డి, ఏ.పీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి, చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, బొల్లు రామ మోహన్, రచయిత, సంఘ బాధ్యులు వి. వి కృష్ణారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యు . సుబ్రహ్మణ్యం చెన్నయ్య, భాస్కర్ రెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు, వాకా చంద్రశేఖర్, పుల్లయ్య, చంద్రహాస రెడ్డి, వెంకటరెడ్డి తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర ఉపాధ్యాయ వృత్తి లో పనిచేయడం సంతోషదాయకం అని కొనియాడారు.. కుటుంబ సభ్యులు శశికళ, వారి కుమార్తె వైష్ణవి, అల్లుడు రఘునందన్ మరియు వారి బంధుమిత్రులు పాల్గొన్నారు. పోరుమామిళ్ల ప్రాంత అభిమానులు, శిష్యులు ఘనంగా సత్కరించారు.



## నరసాపురంలో దారుణం..

## పట్టపగలే యువతి దారుణ హత్య

**నరసాపురం స్టేషన్ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు కారు మాట్లాడుకున్న వైనం**

**మార్గమధ్యంలో వాటర్ బాటిల్ కొనేందుకు కిందికి దిగిన యువతి**

**కత్తితో దాడి చేసిన మార్గాని రమేశ్ అనే వ్యక్తి**

**యువతి మృతి... దాడిని అడ్డుకోబోయిన కారు డ్రైవర్ కు గాయాలు**

ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువతిని పట్టపగలే దారుణంగా హత్య చేసిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతురాలిని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన టీనా రోజాగా గుర్తించారు. ఆమె సుళ్లూరుపేటలో ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో నరసాపురం రైల్వే స్టేషన్‌లో దిగి, తన స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ కారును అద్దెకు మాట్లాడుకున్నారు. ప్రయాణ మధ్యలో వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు ఓ దుకాణం వద్ద కారు ఆపారు. అదే సమయంలో మార్గాని రమేశ్ అనే వ్యక్తి కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఇది గమనించిన కారు డ్రైవర్ సురేశ్, దుండగుడిని అడ్డుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన టీనా రోజా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!

రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ (ు1చీ1), ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు.

## డాక్టర్ గా ప్రజాప్రతినిధిగా పట్టణాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి మృతి పట్ల రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ టిడిపి సీనియర్ నాయకుడు ఏవి సుబ్బారెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆదివారం నాడు పట్టణంలోని నెహ్రూ వీధిలోని ఆయన నివాసానికి చేరుకొని, ఏవి సుబ్బారెడ్డి మరియు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ రెడ్డి డాక్టర్ రామలింగారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యుడుగా సేవలందించిన డాక్టర్ రామలింగారెడ్డి ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్మన్ గా ప్రజాసేవ చేశారని ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులందరినీ ఓదార్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. కృష్ణమోహన్ హుస్సేన్ రెడ్డి ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com